ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

జూన్ 8, 2008

కథా నిలయం
శ్రీకాకుళం





సాలార్‌జంగ్ మ్యూజియం

అద్భుతం...అపూర్వం

HAPPY BIRTHDAY

హ్యాపీ బర్త్‌డే

(2008 జూన్-8 నుంచి-2008 జూన్-14టవరకు)

ప్రభాత్
4సం॥, జూన్-2004
నిర్మల-హరికిషోర్
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

స్రవంతి
8సం॥, జూన్-8
లక్ష్మి-బాల్‌రాజ్
దండుమైలారం-రంగారెడ్డి

పి. రాకేష్
జూన్-10
పార్వతి-సుభాష్‌చంద్రబాబు
తిరుపతి-చిత్తూరు

బబ్లూ
5సం॥, జూన్-9
లక్ష్మి-బాల్‌రాజ్
దండుమైలారం-రంగారెడ్డి

బన్ను
5సం॥, జూన్-8
శ్రీదేవి-చక్రవర్తి
కూకట్‌పల్లి-హైదరాబాద్

అభిషేక్ (బన్ని)
2సం॥, జూన్-10
లావణ్య-దర్శన్
దండుమైలారం-రంగారెడ్డి

నాగలక్ష్మి
8సం॥, జూన్-11
సత్యనారాయణమ్మ-గిరిబాబు
పెదవలస-విశాఖపట్నం

కథ నిలయం
శ్రీకాకుళం



అన్నదాతను మరవద్దు

మన అతిథి

పేరు : డా॥ ఆదాల విష్ణువర్ధన రెడ్డి
తల్లిదండ్రులు : ఆదాల శర్వాణి, ఆదాల రమణా రెడ్డి
స్వగ్రామం : ఊటుకూరు గ్రామం, విడవలూరు (మండలం), నెల్లూరు (జిల్లా)
పుట్టిన తేది : 30, సెప్టెంబరు, 1962
విద్యార్హతలు : బి.యస్సీ (వ్యవసాయం), ఎంఎస్సీ (అగ్రి), పిహెచ్‌డి (Genetics and Pl)
వృత్తి : ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు)గా జూలై 2007 నుండి ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలెం. శాస్త్రవేత్తగా నూనె గింజల పరిశోధనా సంచాలనాలయం, హైదరాబాద్ (1992 నుండి 2007 వరకు)
కృషి : వృత్తి పరంగా వరి, పొద్దు తిరుగుడు, ఆముదం, నువ్వులు పంటలపై పరిశోధనలు చేసి జన్యుపరంగా మేలైన రకాలను రూపొందించారు. పొద్దు తిరుగుడు, కుసుమ అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలు, సంకర రకాల నాణ్యమైన విత్తనాలను తయారు చేసి రైతులకు అందించారు. ఈ పంటలలో అధికోత్పత్తి సాధించటానికి తగిన సలహాలను రైతులకు అందించటంలో ఎప్పటికప్పుడు చురుకైన పాత్ర వహించారు. రాష్ట్ర స్థాయిలో బయో ఇంధన పంటలపై పరిశోధనకు నోడల్ ఆఫీసరుగా ఉన్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్ జనరల్ సెక్రటరీగా రెండు సంవత్సరాలు (2004-05) పని చేశారు. జర్నల్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్‌కి ఆరు సంవత్సరాలు సంపాదకులుగా పని చేశారు. వందకు పైగా పరిశోధనా పత్రాలు రాశారు.
ఇష్టమైనవి: కష్టపడి పనిచేయడం
ఇష్టంలేనివి: స్వార్థం, కుటిలత్వం
అవార్డులు: పంటల అధికదిగుబడికి సంబంధించి జవహర్ లాల్ నెహ్రూ అవార్డు (1993వ సంవత్సరం), చౌదరీ దేవీలాల్ అవార్డు 2005 లో భాగస్వామ్యం, ఆంధ్రప్రదేశ్ ఉత్తమ సైంటిస్ట్ అవార్డు (2008)

వ్యవసాయ రంగంలో మన రాష్ట్రం, దేశం ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ, ఇంకా మన దేశంలో కడుపునిండా రెండు పూటలు తినడానికి తిండి లేని వారు చాలా మంది ఉన్నారనడంలో సందేహం లేదు. దేశంలో ఎంతో అభివృద్ధి జరిగినప్పటికీ గొప్ప, బీదల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగానే ఉందనేది వాస్తవం. ప్రతి ఒక్కరూ వృత్తిపరంగానూ, ఆర్థికంగానూ ఎదగాలని, ఉన్నత స్థానానికి చేరుకోవాలని అనుకోవడం సహజం. అలా ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందడం ద్వారా దేశాభివృద్ధికి పాటుపడడం చాలా ఉన్నతం. అయితే మన ఎదుగుదల స్వయంకృషితోనూ, స్వంత మేధోశక్తితోనూ కూడుకున్నదై ఉండాలి తప్ప, పక్కవారి శ్రమ, మేధస్సులను తస్కరించి లేదా తోటివారిని అణగదొక్కి ఎదగాలనుకోవడం బాధాకరం. మనదేశంలో ఎంతో మంది ఆర్థికంగా స్థిరపడిన లేదా అభివృద్ధి చెందుతున్న వారున్నారు. అలాంటి ప్రతి ఒక్కరూ తమతో పాటు మరి కొంత మంది అభ్యున్నతికి సహకరించినట్లయితే అభివృద్ధి వేగవంతమవుతుంది. ఏ రంగం వారయినా తమ స్వంత లాభాన్ని, అభివృద్ధిని కొంత తగ్గించుకొని పరుల కోసం యోచిస్తే మన సమాజంలో హెచ్చుతగ్గులు కొంత వరకయినా తగ్గవచ్చు. ఒక వ్యవసాయ శాస్త్రవేత్తగా, మనదేశ వ్యవసాయరంగం అన్ని రకాలుగా ఇంకా ఎంతో అభివృద్ధి చెందాలనేది నా ఆకాంక్ష. మనకున్న శాస్త్ర పరిజ్ఞానం, వనరులతో తప్పక మనం దీన్ని సాధిస్తాం. ఈ దేశంలోని జనాభాను పోషిస్తున్న వ్యవసాయదారుని, మరియు వ్యవసాయ కూలీని మరవద్దు అనేది ఈ సందర్భంగా నా మనవి.

ఆదాల విష్ణు వర్ధన రెడ్డి

ఈ సంచికలో....

టపా ... 2
ఆరోగ్యం ... 4
సరదాగా ... 5
సీరియల్ ... 8
సినిమా ... 10
సలహాలు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
విజ్ఞాన వీచిక ... 17

ఇంకా...



చూద్దామా ... 3
శత్రు దుర్భేద్య గండికోట

మంచిపుస్తకం ...6
ఆల్‌రౌండర్
ఆరుద్ర సమగ్ర దర్శనం

నవ్వుల్ పువ్వుల్ ... 19
లాహిరి లాహిరి ... 20
మనసా... తెలుసా ... 22
రుచి ... 23
కొత్త పుస్తకాలు ... 24

సమ్‌థింగ్ స్పెషల్ ... 18
బుల్లి చొక్కా
భలే ముద్దొస్తోంది





విలువైన విశేషాలు

మే మాసం చివరి సంచికలోని అట్టమీది కథలో ఎవరెస్టుకు సంబంధించిన ఎన్నో విలువైన విశేషాలున్నాయి. 'విజ్ఞాన వీచికలో' పేర్కొన్న 'కృత్రిమ కళ్ళు' సైన్స్ సాధించిన మహాద్భుతమని చెప్పవచ్చు. "బహురూపి బుష్" పలు రకాల చిత్రాలు, హావభావాలు బహు గమ్మత్తుగా ఉన్నాయి. 'సమ్‌థింగ్ స్పెషల్'లో వేషాలు మార్చటంలో దిట్ట అయిన పెండెం కృష్ణకుమార్ గురించి చదివి చాలా సంతోషించాం. ఈ విచిత్ర వేషధారణ కళలో ఆయన ఇంకా సాధన చేసి, ఖండాంతర కీర్తిని సముపార్జించాలని మా అభిలాష. 'సినిమా కబుర్లు' ద్వారా, నరేష్‌ని కలుసుకున్నందుకు మాకు చాలా ఆనందంగా ఉంది. వారింకా స్లిమ్‌గా మారి హీరోగా తిరిగి అరంగేట్రం చేయాలని మా అభిప్రాయం. "బాల నేస్తాలు"లో సాహిల్ అందిస్తున్న 'చేసేద్దాం' అంశం ఎంతో బావుంటున్నది. అమెరికా, బ్రిటన్ దేశాల తరహా రెండు పార్టీల వ్యవస్థ ఉండాలంటున్న మన అతిథి పల్లె రంగారెడ్డి గారి మనోగతం స్వాగతించే విధంగా ఉంది. చూద్దామా, ఆరోగ్యం శీర్షికలూ బావుంటున్నాయి.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
ఎలిసిపురం జంక్షన్,
శ్రీకాకుళం టౌన్.

అతిథి ముచ్చట్లు బావున్నాయి

25 ఆదివారం అనుబంధం స్నేహలో 'ప్రపంచంలోని అన్ని సంస్కృతులు సంప్రదాయాల కన్నా మనదేశ సంస్కృతులు సంప్రదాయాలు గొప్పవి. మన వారికి అన్ని విషయాల్లో చాలా ఓపిక ఎక్కువ' అంటూ మన అతిథిలో చాలా చక్కగా ముచ్చటించారు పల్లె రంగారెడ్డి గారు. భారతదేశ రాజ్యాంగాన్ని రాసిన పరిశోధకుడు, హరిజన కుటుంబంలో పుట్టిన మహనీయుడు, బడుగు నేతల అంతర్వాహిని అంబేద్కర్ మార్గం అంటూ డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విశ్లేషణాత్మక అధ్యయనం పుస్తక సమీక్షను చాలా చక్కగా చేతికందించారు. అంబేద్కర్ ఒక వ్యక్తి కాదు. శక్తి అంటూ సమీక్షను కొనసాగించిన తీరు బాగుంది. ప్రతివారం స్నేహ ప్రత్యేక శైలిలో ఓ మంచి పుస్తకాన్ని మాకు పరిచయం చేస్తున్నందుకు ధన్యవాదాలు. అట్టమీది కథలో 'ఎవరెస్ట్ ఎక్కడం ఎంత కష్టమో!' అంటూ ఎవరెస్ట్ శిఖరపు ఎత్తును ఎవరు ఎప్పుడు కొలిచారు. తొలిసారిగా ఎవరు అధిరోహించారు? అక్కడ వాతావరణం ఎలా వుంది. వారు ఎన్ని ఇబ్బందులు పడ్డారు? వారికి ఎటువంటి ప్రతిఫలం దక్కింది. ఎవరు ఎప్పుడు కొలిచారు? వారికి ఎటువంటి ప్రతిఫలం దక్కింది. ఎవరెస్ట్‌లో విశేషాలేమిటి? అన్న అంశాలను ప్రారంభం నుండి ముగింపు వరకు ప్రతి ఒక్క పేరాగ్రాఫ్ చదివించింది. అట్టమీది కథని, మాకు అర్థమయ్యేరీతిలో తీర్చి దిద్ది మా ముందు కొచ్చి ముచ్చటిస్తున్న స్నేహకు స్పెషల్ థ్యాంక్స్. విజ్ఞాన వీచికలో కృత్రిమ కళ్ల పరిశోధనలు చాలా కాలం నుండి జరుగుతున్నాయంటూ కృత్రిమ రెటీనాని మాకు పోటోలో చూపినందుకు నా మన్ననలు. విజ్ఞాన వీచిలో ఉన్న అంశాన్ని చదువుతుంటే నిజంగా మేము పరిశోధన చేసినట్లు ఉంది. అటువంటి రీతిలో పుస్తకాన్ని ముద్రిస్తున్న సంపాదక వర్గానికి నా నమస్కారాలు. ఆరోగ్యంలో బుల్లి ఏసీకి జబ్బు చేస్తే.. అన్న ఆర్టికల్ ఉపయోగకరంగా వుంది. శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందడంతో మన జీవన విధానాలు మారుతున్నాయంటూ నిజ జీవితంలో వాస్తవాలను మాకు తెలియజేసినందుకు ధన్యవాదాలు.

కర్రా వరప్రసాద్,
యలమర్రు, కృష్ణాజిల్లా.

గొప్ప ఆదర్శం

ప్రపంచ అద్భుత సహజ సంపదలలో ఎవరెస్ట్ ఖ్యాతి విశ్వవిఖ్యాతి గాంచింది. విజయం సాధించాలని, పట్టుదల దక్షతగల వారి పాలిట గొప్ప ఆదర్శం ఎవరెస్ట్ శిఖరం! పుట్టిన ప్రతి మనిషి జీవితానికి సార్థకత వుండాలి. 'ఎవరెస్ట్' ఒక పరిశోధకుని పేరని ఈ వారం ముఖ చిత్రకథనం చదివి తెలుసుకోగలిగాము. మన భారత దేశానికి ఉత్తరాన సహజ సిద్ధంగా ఏర్పడిన ఎవరెస్టు శిఖర సముదాయంలో ఎన్నో ఆధ్యాత్మిక, పుణ్య క్షేత్రాలు, యోగులు, సిద్ధ పురుషుల విశేషాలు ఉన్నాయి. ఇవి ఎంతో స్పందింపజేస్తున్నాయి.

జె. సుధాకర్ పట్నాయక్, కాకినాడ.



అన్ని అంశాలు ఆకట్టుకుంటున్నాయి

స్నేహ పుస్తకంలోని అన్ని అంశాలు బావుంటున్నాయి. ముఖ్యంగా వంటలు, రంగుల పేజీలో వస్తున్న విచిత్రాలు, బాలల కథ, కలంస్నేహం. ఇవే కాక చూద్దామా లో వివిధ ప్రదేశాలను గురించి ఇవ్వడం బావుంటోంది. ఇంకా పజిల్స్ లాంటివి ఏవైనా ఇస్తే బావుంటుందికూడా. చిన్న చిన్న కథలు, హాస్యాన్ని అందించే రచనలు ఏవైనా ఇవ్వొచ్చుకూడా. కథలు ఇంకా ఇంకా ఇవ్వాలి. ఈమధ్య చేపతోక జడ గురించి ఇచ్చారు. అదీ విచిత్రంగా బానే వుంది. ఏమైనా ఏదో ఒక కొత్త రకం విషయాన్ని పరిచయం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అందుకు సంతోషం. జోక్స్ మరిన్ని ఇవ్వండి. సంతోషిస్తాం. కార్టూన్లు ఇంకా పదునుగా వుంటే బావుంటుంది. పిల్లల పేజీలో ఆటలు ఇవ్వడం సమ్మర్‌లో సమయానుకూలంగా వుంది. మరిన్ని ఆకట్టుకునే అంశాలు ఇస్తారని ఆశిస్తూ... సెలవ్.

జి. భావన,
పెదకాకాని.



ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహి తులు, సహోద్యోగులు, ఇరుగు పొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచి కరమైన వంటలు, అల్పా హారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుం టారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదల చుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
స్ట్రీట్ నెం. 1,. అశోకనగర్, హైదరాబాద్-20.

చూద్దామా...

ఎస్.మస్తాన్‌వలి, కడప

కవి నిలయం
శ్రీకాకుళం

శత్రు దుర్భేద్య గండికోట



కడప జిల్లా జమ్మలమడుగులో సందర్శించాల్సిన ప్రాంతాలు రెండున్నాయి. 1. మైలవరం జలాశయం. 2. గండికోట. గండికోటకు గొప్ప చరిత్ర ఉంది. శత్రుదుర్భేద్యమైన కోటగా గండికోట ప్రసిద్ధినొందింది. దీన్ని చాళుక్యులు, కాకతీయులు, విజయనగర రాజులు, నవాబులు, చివరగా ఈస్ట్ ఇండియా కంపెనీ వారు పాలించారు. గండికోట చరిత్ర 12వ శతాబ్ది ప్రారంభంలోనే ఆరంభమైంది. మరి ఆ వివరాలేంటో, అసలు అక్కడ చూడదగిన - పేర్గాంచిన ప్రాంతాలేంటో, ఆ వివరాలేంటో తెలుసుకుందాం.



క్రీ.శ. 1123లో గండికోటను మట్టితో నిర్మించారు. అప్పట్లో ఈ ప్రాంతం కళ్యాణి చాళుక్యుల రాజుల్లో ఒకరైన ఒకటవ అహ్మమల సోమేశ్వరుడు ఏలుబడిలో ఉండేది. ఈ ప్రాంతాన్ని ములికనాడు సీమగా పిలిచేవారు. ఈ ప్రాంత పాలనకు తన ప్రతినిధిగా కాకరాజును నియమించుకున్నాడు రాజు. ములికనాడు ప్రాంతం అంతా దట్టమైన అడవితో ఉండేది. ఈ ప్రాంతంలో కోటను నిర్మించాలనే తలంపుతో కాకరాజు తన మంది మార్బలంతో తిరిగి కొండను ఎక్కి చూశాకే ఈ ప్రాంతం అనుకూలంగా ఉందని తలచి మొదట రంగనాథస్వామి గుడిని నిర్మించారు. అనంతరం గండికోటకు పునాదులు వేసి కీ.శ.1123లో మట్టితో కట్టించారు. కీ.శ.1239 నుంచి 1304 వరకు కాయస్థ వంశీయులు దాదాపు 65 సంవత్సరాలు గండికోట ప్రాంతాన్ని పాలించారు. క్రీ.శ. 1323లో మహమ్మదీయుల దండయాత్రతో కాకతీయ రాజ్యం పతనమవటంతో గండికోట ప్రాంతం మహమద్‌బీన్ తుగ్లక్ పాలన కిందకు వచ్చింది. దాదాపు 20సంవత్సరాల మహమ్మదీయుల పరిపాలనలో గండికోట ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. కీ.శ. 1343లో విజయనగర సామ్రాజ్యం కిందకు వచ్చింది.

ములికినాడు సీమగా ఉన్న గండికోట ప్రాంతం విజయనగర సామ్రాజ్యకాలానికి గండికోట సీమగా మారింది. దీని కింద జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కడప, బద్వేల్, కమలాపురం, పులివెందుల ప్రాంతాలు ఉండేవి. పెమ్మసాని తిమ్మనాయుని పరిపాలనలో గండికోట ప్రాభవం దక్షిణ భారతదేశంలో మారుమోగింది. శ్రీకృష్ణదేవరాయులు మరణానంతరం కీ.శ. 1529 సంవత్సరంలో బంగారు తిమ్మనాయుడు గండికోటను పాలించాడు. కీ.శ. 1652లో గండికోటపై మీర్‌జుమ్లా దాడిచేశాడు. అయితే శత్రుదుర్భేద్యమైన గండికోటను జయించడం ఆయన చేత కాలేదు. అయితే మంత్రి లింగన్న బలహీనతలను ఆసరా చేసుకొని కుట్రలు చేసి గండికోటను జయించాడు. అదే సందర్భంలో కోటలో దేవాలయాలు ధ్వంసమయ్యాయి. మీర్‌జుమ్లా అనంతరం గండికోటను కడపను పాలించిన మయానా వంశస్థుడైన అబ్దుల్ నభీఖాన్ ఆక్రమించుకున్నాడు. ఈయన కోట అభివృద్ధికి కృషి చేశాడు. తర్వాత కాలంలో గండికోటను ఆంగ్లేయులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా చూసినప్పుడు గండికోటను పాలించిన ప్రముఖ సామంతరాజులుగా పశ్చిమ చాళుక్యుల కాలంలో కాకరాజు, కాకతీయుల కాలంలో అంబదేవుడు, విజయనగర రాజుల కాలంలో పెమ్మసాని రామలింగనాయుడు, బంగారు తిమ్మనాయుడు, పెమ్మసాని తిమ్మనాయుడు, గోల్కొండ సుల్తానుల కాలంలో మీర్ జుమ్లా కడప మయానా వంశస్థుల కాలంలో అబ్దుల్ నభీఖాన్ ఈస్ట్ ఇండియన్ కంపెనీ కాలంలో ఆంగ్లేయులు ఉన్నారు.

శిల్ప కళలు

గండికోటలోని రఘునాథస్వామి దేవాలయం, మాధవరాయస్వామి దేవాలయాలు విజయనగర సామ్రాజ్య పాలకుల సాయంతో అత్యంత అద్భుతంగా నిర్మించారు. హనుమంతుడు, కపోతములు, గజములు, నృత్యం చేస్తున్న స్త్రీలు, సింహాలు, నరసింహ, యోగాసనంలో ఉన్న పురుషుడు, మత్స్యావతార ద్వారపాలకులు, హిరణ్య కశ్యపుడు, సంగీత వాయిద్యాలు, మకరం, కూర్మం మొదలగునవి ఉన్నాయి.

శాసనాలు

గండికోటను పాలించిన రాజ ప్రతినిధులు వేయించిన శాసనాలు ఉన్నాయి. మాధవరాయ స్వామి దేవాలయం అర్థమండ

తరువాయి 7వ పేజీలో....



ఎన్ని నీళ్లు తాగాలి?

డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు
ప్రకృతి వైద్య నిపుణులు

'ప్రతి రోజూ మనిషి ఎన్ని నీళ్లు తాగాలన్నదీ సరిగా తెలియని విషయమా? ఎనిమిది గ్లాసుల నీరు తాగితే సరిపోతుంది' అని కొందరు అంటే, కొందరు మూడు గ్లాసులు తాగాలంటారు. డాక్టర్లు రోజూ ఎంత ఖర్చు అయితే అంత నీటిని తాగితే సరిపోతుందంటారు. న్యూస్ పేపర్లలో, వారపత్రికల్లో ఇంకో కొలత చెబుతారు. ఏది వాస్తవమో, ఏది కాదో ఏం చేయాలో తోచక అయోమయంలో పడుతుంటారు జనం. మరి ఆ వివరాలేంటో ఈ వారం తెలుసుకుందాం.



శరీరంలో మలినాలు ఉంటాయి. ఆ దోషాలన్నీ కరిగేది నీటిలోనే. ఆ నీరు సరిపడా లేకపోతే లోపలే ఎండిపోతాయి. మన శరీరంలో రోజూ మలం, మూత్రం, చెమట, శ్వాస, జీర్ణక్రియ అవసరాలను తీర్చడానికి అయ్యే నీటి ఖర్చు సుమారు 2.5 లీటర్లు. కోల్పోయిన ఈ నీటిని అందిస్తే సరిపోతుందని డాక్టర్లు అంటారు. ఇలా చేస్తే 68 శాతం నీరు తగ్గకుండా వుంటుంది. మనం రోజూ తీసుకునే ఆహారంలో ఉప్పు, నూనెలు, నెయ్యి, పంచదార, వేపుళ్లు వుంటాయి. వీటిని తినడం వల్ల శరీరంలోకి వందలరెట్లు వ్యర్థ పదార్థాలు వెళ్తుంటాయి. మనం తాగే 2.5 లీటర్ల నీటిలో 50 శాతం మలినాలతో కలిస్తే, మిగతా 50 శాతం వుంటాయి. మనం తాగే 2.5 లీటర్ల నీరు చాలక, నిల్వ ఉన్న వ్యర్థ పదార్థాల వల్ల దుర్వాసనలు వస్తున్నాయి. శరీర ధర్మం ప్రకారం రోజుకు 5 లేదా 6 లీటర్ల నీరు తాగడం ప్రారంభిద్దాం. ఈ నీళ్లతో శరీర అవసరాలు, ఇటు విసర్జన క్రియ బాగా జరుగుతుంది.

శరీర విధులు

ఒక రోజుని రెండు భాగాలుగా పగలు 12 గంటలు, రాత్రి 12 గంటలుగా విభజించారు. శరీరానికి పగటి డ్యూటీ. రాత్రి డ్యూటీ అని వేరు వేరుగా వుంటాయి. రెండు డ్యూటీలను విడివిడిగా చేస్తేనే శరీరం ఆరోగ్యంగా వుంటుంది.

పగటి డ్యూటీ

తీసుకున్న ఆహారాన్ని అరిగించడం. అరిగిన దాన్ని కణాలకు మోసుకుని వెళ్లడం, మోసుకుని వెళ్లిన దాన్ని శక్తిగా మార్చడం, విడుదల అయిన వ్యర్థ పదార్థాలను విసర్జక అవయవాలకు చేర్చడం. రెండోది.. ఆయుష్షు అయిపోయి రోజూ మనలో ఉన్న కొన్ని కోట్ల కణాలు చనిపోతుంటాయి. వాటి స్థానంలో కొత్త కణాలను తయారు చేయడం. ఈ రెండు పనులు సమర్థవంతంగా జరగాలంటే నీటి అవసరం ఎంతో వుంది. నీరు సరిగా తాగితేనే ఆహారాన్ని అరిగించే రసాలు తయారవుతాయి. నీరు తాగితేనే అరిగిన ఆహారం రక్తంలోనికి వెళ్తుంది. నీరుంటేనే రక్తంలోని ఆహారం కణాల్లోకి వెళ్తుంది. సరైన నిష్పత్తిలో నీరుంటేనే కణాల్లో ఆహారం శక్తిగా మార్పు చెందుతుంది.



రాత్రి డ్యూటీ

మొదటిది.. పగలు తిన్న ఆహారపదార్థాల ద్వారా తయారైన వ్యర్థ పదార్థాలు మలం, మూత్రం, చెమట, కార్బన్‌డయాక్సైడ్‌ల ద్వారా కొంత వరకూ పగటి పూట విసర్జిస్తాం. మిగిలిన వ్యర్థ పదార్థాలను విసర్జించే కార్యక్రమం రాత్రంతా కణాలు చేస్తుంటాయి. ప్రతి రోజూ మనలోని ఎన్నో కణాలు జబ్బుల బారిన పడుతుంటాయి. ఆ కణాలను నీరు రిపేర్ చేస్తుంది. వ్యర్థ పదార్థాలు బయటికి రావాలంటే శరీరంలో సరిపడా నీరుండాలి. నీళ్లు లేకపోతే లోపలే ఎండుకుపోతాయి.

పరగడుపున నీళ్లు ఎందుకు తాగాలి?

రాత్రిపూట విడుదలయ్యే విసర్జక పదార్థాలను నిద్రలేచిన దగ్గరి నుండి క్లీనింగ్ చేసుకోవడానికి ఆ నీరు పనికి వస్తుంది. రాత్రిపూట శరీరంలోపలి క్లీనింగ్, రిపేరు జరుగుతున్నా, మనం రాత్రిపూట నిద్రమేల్కొని తాగలేం కాబట్టి, నిద్రలేచిన దగ్గర నుంచి మరలా ఏదైనా తినేలోపు తాగే నీటిని పరగడుపున తాగే నీరు అంటారు. 2.5 నుంచి 3 లీటర్ల నీరు పరగడుపున తాగితే వ్యర్థ పదార్థాలు శరీరం నుంచి పూర్తిగా బయటికెళ్తాయి.

పగటి పూట తాగే నీరు

ఉదయం టిఫిన్ తిన్న తర్వాత నుంచి సాయం కాలం 6,7 గంటలలోపు వరకు తాగే నీరు దీని కిందకు వస్తుంది. 5,6 లీటర్ల నీటిలో రాత్రి డ్యూటీకి 2.5 నుంచి 3 లీటర్ల నీరు ఖర్చవగా... మిగిలిన 2.5 నుంచి 3 లీటర్ల నీటిని పగటి డ్యూటీకి కేటాయించాలి. శరీరం ప్రతి రోజూ రెండు రకాల విధులను చేయడం అనేది తప్పదు. ఆ విధులు బాగా జరగాలంటే నీటిని అలా రెండు భాగాలుగా విడగొట్టి తాగక తప్పదు. ఉదయం బాగా తాగాం కదా అని పగటి పూట తాగడం మానేస్తే మీలో పగటి పూట డ్యూటీలో శరీరం ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాగే పగలు తాగి ఉదయం మానేస్తే రాత్రి డ్యూటీలో వెళ్లాల్సిన వ్యర్థ పదార్థాలు మిగిలి కొన్ని ఇబ్బందులొస్తాయి.

అందుకే రోజుకి ఐదారు లీటర్ల నీటిని పైన పేర్కొన్న విధంగా తాగాలి. ❋

సరదాగా...

అంజన.కె

సెల్ సుబ్రావ్!

'సెల్ సుబ్రావ్'కి మొదట సెల్ లేదు. ఎవరి దగ్గర సెల్ చూసినా అసూయ పడేవాడు. సుబ్రావ్ భార్య కూడా అంతే! ఇరుగుపొరుగు సెల్‌లో మాట్లాడుతుంటే చూసి ఓర్వలేక ఓ రోజు భర్తను చడమడా తిట్టేస్తుంది. ఆ దెబ్బతో అప్పు చేసి మరీ సెల్ కొంటాడు సుబ్రావ్. ఆ తర్వాత అతను ఎన్ని తిప్పలు పడ్డాడో, అసలు అతనికి 'సెల్ సుబ్రావ్' అని పేరు ఎందుకు వచ్చిందో మీరే చదవండి...!

సుబ్రావ్ ఆరోజు చాలా మూడీగా వున్నాడు. కారణం కోసం బుర్ర బద్దలు కొట్టుకోనక్కర్లేదు. రాత్రి భోజనాల సమయంలో భార్య చేసిన ఎగతాళే అందుకు కారణం. ఆ మాటలు గుర్తొస్తేనే సుబ్రావ్‌కి కోపం తన్నుకొస్తోంది. ముక్కు ఎర్రబడుతోంది.

"అమ్మా! రాత్రి ఎన్ని మాటలంది!? నేను కనీసం సెల్ కూడా లేని పోరంబోకునా! పనికి మాలినవాణ్ణా! చివరాఖరికి ఎందురింటి అప్పారావుకి, పక్కింటి పుల్లారావుకి, వెనకింటి వెంకట్రావుకి కూడా సెల్ వుందా? వాళ్ల భార్యలు బడాయిగా బయట నిలబడి బోలెడంతసేపు సెల్‌లో సొల్లు మాట్లాడుతున్నారా? అయినా... దానికి నేనేం చేయను! వాళ్లకి నేనేదో సెల్ కొనిపెట్టినట్లు ఈవిడ తెగ ఫీలైపోతోంది మొద్దు మొహం.

ఏదైనా అవసరమైతే ఎస్టీడీ బూత్‌కెళ్లి మాట్లాడతాం కదా. ఇంకా సెల్ లేదని గోలపెడుతోందేంటి పిచ్చిమాలోకం. తనను అనుకుని లాభం లేదులే. నాకు సెల్లుంది నాయనలారా అని చెప్పడానికి మూర్ఛవ్యాధోడికి మల్లే దాన్ని ఒక తాడుకు కట్టి మెళ్లో వేసుకుని తిరుగుతాడు పతోడూ... ఒకవేళ సెల్ వుందే అనుకో... జాగ్రత్తగా ఎవడికీ కనపడకుండా ముందు జేబులోనో, ఎనక జేబులోనో ఏడవచ్చుకదా. ఊహూ...పబ్లిసిటీ ఇచ్చుకుంటారు. ఏ సిటీ బస్సులోనో ఎవడో ఒకడు నొక్కేస్తేగాని...దూల తీరదు..." అనుకుంటూ రోడ్డు మలుపు తిరుగుతుండగా...

రోడ్డుమీద చెత్త పోగుచేస్తున్న మున్సిపాలిటీ ఉద్యోగి జేబులో సెల్ మోగింది. అతను గబుక్కున చేతిలో బుట్ట, చీపురు పక్కన పెట్టి మెళ్లో సెల్ తీసి "హల్లో...ఎవరూ.... ఓసోస్ నువ్వట్రా ప్రసాదూ! ఎన్నాళ్లైంది నీతో మాట్లాడి? అవునూ నా నెంబరు నీకాడికెట్టొచ్చిందేటి? అవున్రా... కొత్త బొమ్మ 'కంత్రీ' చూశావట్రా! నీ అభిమాన హీరో కదా..." అంటూ లొడలొడా... మాట్లాడసాగాడు.

ఇక చూస్కోండి సుబ్రావ్ కోపం నషాళానికి అంటింది. 'ఛత్! ఆఖరుకు చెత్త ఏరుకునేవాడి దగ్గర కూడా సెల్ వుంది. ఇంక పెళ్లాం దృష్టిలో చీప్ అవను మరీ..." అనుకుంటూ ముందుకు నడవసాగాడు. ఈలోగా తను ఎక్కాల్సిన బస్సు కనిపించడంతో చెయ్యెత్తి ఆపి ఎక్కేశాడు. ఇక అక్కడా సుబ్రావ్ ప్రశాంతంగా వుండలేకపోయాడు. ఎవడి సెల్ మోగినా ఉడుక్కోసాగాడు. ఈలోగా దిగాల్సిన స్టాప్ రావడంతో దిగేశాడు. చకచకా ఆఫీసు చేరాడు. ఫ్రెష్షుగా...ఫైళ్లు తీస్తుండగా దొడ్లు శుభ్రం చేసే అతను వచ్చాడు. అదీ మామూలుగా కాదు. జేబులో సెల్ పెట్టుకొని ఇయర్ ఫోన్లతో ఎఫ్‌ఎమ్ రేడియో వింటూ.. చీపురు తిప్పుతూ రాసాగాడు. ఇంక సుబ్రావ్ కంట్రోల్ చేసుకోలేకపోయాడు. కిందపడి దొర్లాలనిపించింది. అప్పు చేసైనా సరే సెల్ కొనాల్సిందే అనుకున్నాడు.

ఫ్లెయ్యిరూపాయలు హ్యాండ్‌లోన్ తీసుకొని కొనేశాడు. సుబ్రావ్ వాళ్లావిడ బోలెడు సంతోషపడింది. చుట్టుపక్కల అందరికీ సెల్ చూపించి మురిసిపోయింది. సుబ్రావ్ కూడా ఏదో కోటి రూపాయల లాటరీ తగిలినంత సంతోషపడిపోసాగాడు. కానీ తన దగ్గర సెల్ వుందన్న విషయం జనాలకు తెలియచేసే అవకాశం రానందుకు తెగ బాధపడిపోసాగాడు. మరి ఎవరైనా కాల్ చేస్తేనేకదా. స్టైల్‌గా జేబులోంచి తీసి మాట్లాడేది. అలా లాభం లేదనుకొని తెలిసిన వాళ్లందరికీ నెంబర్ ఇచ్చాడు. ఇవ్వగానే చేసేస్తారా ఫోను. రోజు మొత్తం మీద ఒకసారి మోగితేనే గొప్ప. చాలాసేపు రింగు రానిచ్చి... జనాలంతా తన వైపు చూశాక...మెల్లగా...జేబులోంచి తీసి మాట్లాడుతుంటే మజాగా వుంటుందిలే సుబ్రావ్‌కి.

ఇంక లాభం లేదనుకొని...తనకు కొత్తగా పరిచయమైన వారికి కూడా రెచ్చిపోయి ఫోన్ నెంబర్ ఇవ్వసాగాడు. ఇక చూసుకో నాసామిరంగా! సుబ్రావ్‌కి ఫోన్లు పిచ్చపిచ్చగా రాసాగాయి. అందరూ అతన్ని సెల్ సుబ్రావ్ అనే పిలవసాగారు. ఆఫీసులో చేసే పని తక్కువ... సెల్‌లో సొల్లు ఎక్కువ అయ్యింది. ఆ విషయం బాస్ దాకా వెళ్లింది.

ఓ శుభోదయాన ...బాస్ బెల్లుకొట్టి మరీ సుబ్రావ్‌ని తన క్యాబిన్‌లోకి పిల్చాడు. కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా చూపించకుండా...తనకు తెలిసిన అన్ని భాషల్లోను క్లాస్ పీకసాగాడు. ఈలోగా పది ఫోన్లొచ్చాయి సుబ్రావ్‌కి. బాస్ కోపంగా సుబ్రావ్ సెల్ అడిగి తీసుకున్నాడు. సెల్ సరిగ్గా ఆయన చేతిలోకి రావడం అది మోగడం ఒకేసారి జరిగింది. ఆయన కోపంగా...దాన్ని ఆన్ చేశాడు.

"ఇదిగో సుబ్రావ్! నేను రాంబాబుని. ఆరోజు బస్సులో వద్దు వద్దంటున్నా...ఎప్పటికైనా పనికొస్తుందని నీఫోను నంబరు రాసిచ్చావు చూడు. ఆ రాంబాబుని. నువ్వు అర్జంటుగా రావాలయ్యా... మా ఇంటికి. మా పక్కింటోడు తెగ నకరాల్జేస్తున్నాడు. వాడికీ నాకూ పిట్టగోడమీద పెట్టుకునే పూలకుండీ దగ్గర పేచీ వచ్చింది. నీకు పేపరు ప్రెస్సోళ్లైవరో తెల్సన్నావ్‌గా ఆరోజు. వాళ్లతో మాట్లాడి పక్కింటోడి తిమ్మిరి తీసేయాలి. నువ్వు అర్జంటుగా రావాలి. అన్నట్టు మీ బాస్ ఆఫీసులో కూడా గుర్రు పెట్టి నిద్రపోతాడన్నావుకదా. నువ్వు లేకపోయినా ఆయనకు తెలీదులే. నువ్వు వెంటనే వచ్చేసెయ్...అన్నట్టు అడ్రస్ తెల్సుగా..." అని చెప్పుకుపోతూనే వున్నాడు.

అంతే బాస్‌కి సరిగ్గా ఎక్కడ కాలాలో అక్కడ కాలింది. గబగబా...ఆకుపచ్చ ఇంకుతో తెల్ల కాగితం మీద నాలుగు ముక్కలు గీకేసి సుబ్రావ్ చేతిలో పెట్టి గుమ్మం వైపు చెయ్యి చూపించాడు. తీరా చదువుకుంటే అది డిస్మిస్ ఆర్డర్. అప్పుడు చూడాలి సుబ్రావ్ ఫేస్....!

ఈ బొమ్మ కిమ్మని పండు
ఈ పేరేమిటి?

ఈ ఫొటో ఓ బాలీవుడ్ హీరోయిన్‌ది. జవాబు తెలియాలంటే 21వ పేజీ చూడండి.

తెర

'మంచి పండితులను పేర్కొనమంటే గంటి జోగి సోమయాజులు వంటి వారిని ప్రస్తావించవచ్చు. గొప్ప సామాజిక చరిత్రకారుణ్ణి గుర్తుచేయమంటే సురవరం ప్రతాపరెడ్డి వంటివారిని చెప్పవచ్చు. గొప్ప కవి ఎవరు? అని ఎవరైనా ప్రశ్నిస్తే కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ వంటి వారిని ధైర్యంగా చూపించవచ్చు. శ్రోతల హృదయాలను దోచుకున్న సినిమా కవులను ప్రస్తావించమంటే సముద్రాల, పింగళి వంటి వారిని స్మరించుకోవచ్చు....సంగీతం, నాట్యం వంటి సాహిత్యేతర లలిత కళావేత్తలను, విమర్శకులను పేర్కొనమంటే మంగళంపల్లి బాలమురళీకృష్ణ, వి.ఎ.కె.రంగారావు వంటివారిని ప్రస్తావించవచ్చు. గొప్ప ఇంద్రజాలికుణ్ణి చూపించమంటే పట్టాభిరాం వంటి వారిని ప్రత్యక్షం చేయవచ్చు. ఆధునిక యుగంలో తెలుగులో గొప్ప పరిశోధకులను చెప్పమంటే వేటూరి ప్రభాకరశాస్త్రి వంటివారు గుర్తొస్తారు.



ఆల్‌రౌండర్

ఆరుద్ర సమగ్ర దర్శనం

కాని పైన వివరించిన విభిన్న రంగాలలో సాధికారికత కలిగిన తెలుగుమూర్తిని ప్రస్తావించమంటే ఎంత విస్తృత పరిధిలో పరిశీలించినా ఎంత కాలం పరిశీలించినా ఎంత కాలం అన్వేషించినా శిలా శాసనంలో శాశ్వతంగా లిఖించదగిన ఒకే ఒక పేరు కనిపిస్తుంది. అదే- ఆరుద్ర.

కేంద్ర సాహిత్య అకాడమీ పక్షాన 'భారతీయ సాహిత్య నిర్మాతలు' శీర్షికన ప్రచురితమైన 'ఆరుద్ర' ఉపోద్ఘాతంలో రచయిత డా.మేడిపల్లి రవికుమార్ రాసిన వాక్యాలివి.

చిన్నవీ పెద్దవీ కలిసి ఈ పుస్తకంలో మొత్తం పద్నాలుగు అధ్యాయాలున్నాయి. ఒక క్రమపద్ధతిలో విషయమూ విశ్లేషణల మేళవింపుగా ఆరుద్ర విశ్వరూపాన్ని ఆవిష్కరించేందుకు మేడిపల్లి చేసిన ప్రయత్నం ప్రశంసనీయమైంది. అకాడమీ పుస్తకాల పరిమితులు, పద్ధతుల రేఖలలోనే ఆయన ఆరుద్ర జీవిత సాహిత్యాలకు సంబంధించిన అన్ని పార్శ్వాలనూ స్పృశించగలిగారు.

ఉపోద్ఘాతం తర్వాత 'ఆరుద్ర జీవితం' అన్న రెండవ అధ్యాయంలో విశాఖపట్నంలో ఆయన పుట్టుక (1925 ఆగష్టు 31) – కుటుంబ నేపథ్యం, బాల్యం, తొలి విద్యాభ్యాసం, సాహిత్య పరిచయం తదితర సమాచారాన్ని పొందుపర్చారు. అసలు పేరు భాగవతుల సదాశివ శంకర శాస్త్రి. అనేక కలం పేర్లను వాడుతూ చివరకు ఆరుద్రగా స్థిరపడ్డారు. ప్రపంచ సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఆరుద్రకు పాఠశాల చదువులు స్వల్పమే. సాంకేతికంగా చెప్పాలంటే ఆయన విద్యార్హత ఎస్సెస్సెల్సీనే. పైగా ఆయన ఏ బళ్లోనూ తెలుగు చదువుకోలేదు. అసలు చదువంతా పాఠశాలల్లోనూ కళాశాలల్లోనూ గాక గ్రంథాలయాల్లోనే జరిగింది అని స్వయంగా చెప్పుకున్నారు. తండ్రి నరసింగరావు సాహిత్యాభిలాషి కావడంతో కనిపించిన పుస్తకమల్లా తెచ్చేవాడు. వాటిని కుర్ర ఆరుద్ర ఎప్పటికప్పుడు చదువుతుండేవాడు. అందులోనూ మేనమామ మహాకవి శ్రీశ్రీ అప్పటికే విశాఖ రీడింగు రూములో పుస్తకాలన్నీ తాను చదివేసి ఆపైన ఆరుద్రతోనూ చదివించాడు. 13 ఏళ్ల వయసులోనే ఆరుద్ర కవిత్వ రచన మొదలెట్టారు. తర్వాతి కాలంలో రోణంకి అప్పలస్వామి ఆయనలో సాహిత్యదీపం వెలిగించాడు. కొడవటిగంటి కుటుంబరావు ఆయనలో సాహిత్య ప్రతిభకు పదును పెట్టారు. చాగంటి సోమయాజులు మార్క్సిజాన్ని మేధోగతం చేసుకోవడానికి ఉత్ప్రేరకంగా పనిచేశారు.

చివరకు 1942లో సెట్టి ఈశ్వరరావు సిఫార్సుపై ఆరుద్ర కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం స్వీకరించి పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. తిండి కొరతను నివారించేందుకు దొంగనిల్వలు వెలికి తీసేందుకు ఉద్యమించారు. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ రష్యాపై దాడి చేశాక అది అందుకు వ్యతిరేకంగా తన వంతు పాత్ర నిర్వహించేందుకై ఆరుద్ర వైమానిక దళంలో చేరారు. అక్కడ కూడా అధ్యయనం కొనసాగించారు. ఆనందవాణి పత్రికలో కొలువుతో సహా అనేక మజిలీల తర్వాత ఒక స్నేహితుడి నిస్వార్థ సహాయంతో మద్రాసు వెళ్లి స్థిరపడి సినిమా రచన, సాహిత్య సృజన, పరిశోధన ఇబ్బడి ముబ్బడిగా సాగించారు. ఈ వైనాలన్నిటినీ మేడిపల్లి రవికుమార్ చక్కటి భాషలో, ఇంపైన వాక్యాలతో, ప్రామాణిక సమాచారంతో పాఠకులకు అందజేశారు. ఆరుద్ర లేత ప్రాయంలోనే హేతువాద భావాలు అలవర్చుకున్నాడు. 1955 ఏప్రిల్ 22న దర్శక దిగ్గజం హెచ్ఎంరెడ్డి, శ్రీశ్రీలే సాక్షులుగా అరవై రూపాయల ఖర్చుతో రామలక్ష్మిని రిజిస్టరు వివాహం చేసుకున్నారు. దంపతులిద్దరూ హేతువాద భావాలనే కొనసాగించారు. వారి అన్యోన్యతను చెబుతూ రవి కుమార్ 'జీవితంలో కోరుకున్న వ్యక్తులు లభించినంత మాత్రానే ఇది జరగలేదు. ఇద్దరూ ఒకరి లోకి ఒకరు కాక ఇరువురూ ఒకే వైపు చూడటం వల్లనే ఇది సాధ్యమైంది' అని ఒక మంచి వాక్యం చెప్పారు.

'సాహిత్య దృక్పథం' అన్న మూడవ అధ్యాయంలో రచయిత ఆరుద్ర ఆది నుంచి అభ్యుదయ కవిగానే ప్రస్థానం ప్రారంభించిన వాస్తవాన్ని తెలిపారు. ఆయన ప్రతి రచనలోనూ గతి తార్కిక భౌతిక వాద ముద్ర కనిపిస్తుందన్నారు. తర్వాత 'కావ్యావిష్కరణ' అన్న నాలుగో అధ్యాయంలోకి ప్రవేశం. సహజంగానే ఇందులో ఎక్కువ భాగం త్వమేవాహం గురించి. తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా కవిత్వ పరిణామంలో కీలక స్థానమాక్రమించిన ఈ కావ్యం గురించి లోగడ అనేక విశ్లేషణలు జరిగినప్పటికీ ఈ రచయిత దాని సంవిధానాన్ని, సారాంశాన్ని సులభంగా, సుబోధకంగా వివరించడం విశేషం. త్వమేవాహం తెలంగాణా పోరాటం గురించి రాయడం, శ్రీశ్రీ దానికి నామకరణం చేయడం వంటి విషయాలు సుపరిచితమే. మధ్యతరగతి వర్గస్వభావాలను, మనస్తత్వాన్ని తెలుగు కవిత్వంలో సంచలనంగా తొలిసారి ఆవిష్కరించిన కవి ఆరుద్ర' అని తెలిపారు. పారిశ్రామికీకరణ అనంతర భాషా ప్రయోగాలను ఇందులో ఆరుద్ర

వినియోగించాడంటూ దానిలోని ప్రతీకలను కూడా సవివరంగా ప్రస్తావించారు. గాయాలూ గేయాలూ, సాహిత్యోపనిషత్, (ఛందస్సులేని) ఇంటింటి పజ్యాలు, ప్రసిద్ధమైన కూనలమ్మ పదాలు, త్వమేవాహంలోని మధ్యతరగతికి కొనసాగింపు వంటి సినీ వాలి, పైలా పచ్చీసు, అమెరికా ఇంటింటి పజ్యాలు తదితర రచనలను పరిచయం చేశారు. నాట్యశాస్త్రంలోని హస్తముద్ర లక్షణ పదాల్లు మరో ప్రత్యేక రచన. ఆరుద్ర అరబ్బీ మురబ్బాలు ఆయన మరణానంతరం రామలక్ష్మి ప్రచురించారు. అలాగే ఆయన జీవితపు చివరి దశలో మొదలు పెట్టిన మనిషీ-ఆడమనిషీ కావ్యంలోని ఒక భాగం 'స్త్రీ పురాణం' ఇంచుమించు స్త్రీవాదంకంటే ధాటిగా మహిళా కోణాన్ని ఆవిష్కరించింది. ఇలాగే అనువాద కావ్యాలను కూడా పరిచయం చేశారు. దృశ్య కావ్యాలను మరో అధ్యాయంలో ఎరుకపర్చారు. అందులో ప్రత్యేకించి కాటమరాజు కథలో భారత రామాయణాల లక్షణాలను దృష్టిలో పెట్టుకుని రచన సాగిన తీరును తెలిపారు. కథా సాహిత్యం, డిటెక్టివ్ నవలల గురించి క్లుప్తంగా చెప్పిన తర్వాత సమగ్రాంధ్ర సాహిత్య పరామర్శ.

'సాహిత్య విమర్శ' అన్న తొమ్మిదో అధ్యాయంలో వేమన వేదం (1974), మన వేమన వ్యాసపీఠం, గురజాడ గురుపీఠం, ప్రజా కళలూ-ప్రగతివాదులూ (ఇవన్నీ 1985లో షష్టిపూర్తి సందర్భంలో వెలువడినవే) అన్న వ్యాస సంపుటాల పూర్వాపరాలు తెలియజేశారు. ఈ కోవలోనే 'మహనీయులు' అన్న వ్యాససంపుటి కూడా వుంది. ఇక శ్రీశ్రీ జీవిత సాహిత్యాలపై ఆయన తలపెట్టిన బృహద్గ్రంథం 1994లో ధారావాహికంగా ప్రారంభమై అర్ధంతరంగా ఆగిపోయింది. 'రాముడికి సీత ఏమవుతుంది?, 'గుడిలో సెక్స్' అన్న గ్రంథాలు ఆరుద్ర పరిశోధనా పటిమకూ, సామాజిక దృష్టికి నిదర్శనాలవుతాయి. 150 చిత్రాలకు మాటలూ, 500 చిత్రాల్లో నాల్గు వేలకు పైగా పాటలు రాసిన ఆరుద్ర సినిమా పాటలపై ఒక ప్రత్యేక అధ్యాయం వుంది. సినిమా పాటల పరిధిలోనే ప్రయోజనాన్ని ప్రతిభనూ మేళవించిన తీరు గమనించదగ్గది. 'టెక్నిక్ లేని కవిత్వాన్ని వూహించలేను' అన్న ఆయనలోని ప్రయోగశీలతను చమత్కార శైలిని మరో భాగంలో విశదపర్చారు. మొదట్లో చెప్పుకున్న బహుముఖీనతకు అద్దం పట్టే అంశాలను ఆఖరులో రాస్తూ కళలు, క్రీడలు, ఇంద్రజాలం వగైరాలలో ఆయన కృషినీ, కృతులనూ తెలిపారు. ఇన్ని విశిష్టతలు గల ఆరుద్ర షష్టిపూర్తిని ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం పండుగలా జరుపుకోవడం ఆయనకు దక్కిన అరుదైన గౌరవం. ఆరుద్రపై జరిగిన పరిశోధనలు కూడా అరడజనుపైనే వున్నాయి.

మేడిపల్లికి ఆరుద్రతో సన్నిహిత సంబంధం వుంది. సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాలను ప్రజాశక్తి ప్రచురణాలయం పునర్ముద్రించిన తరుణంలో ఆయన ఆరుద్రకు సహాయకుడుగా పనిచేశారు. ఆవిధంగా ఆరుద్ర దంపతులకు ఆప్తుడయ్యాడు. ఆఖరి వరకూ ఆరుద్రకు దగ్గరగా మెలిగిన రవికుమార్ ఆయన మహత్తర కృషిని ప్రతిభనూ ప్రత్యక్షంగా చూశారు. ఆరుద్ర ఆఖరి వరకూ అరుణారుణ చైతన్యం నిలుపుకోవడమే కాక సోవియట్ విచ్ఛిన్న దశలో కూడా పున:ప్రస్థానం కోసం పిలుపునివ్వడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కొంతమందికి వయస్సు పైబడిన కొద్ది విశ్వాసాలు సడలిపోతాయి గాని ఆరుద్రలో మార్క్సిజంపై విశ్వాసం మరింత గట్టిపడిందని కొనియాడారు. 14వదైన ముగింపు అధ్యాయంలో రచయిత 1998 జూన్ 4న కన్నుమూసిన ఆరుద్ర అంతిమ ఘట్టాలను ఆయన కవితా చరణాలు కలగలిపి చెప్పడం విలక్షణంగా వుంది. ఆయన అన్నట్లు ఆరుద్ర జీవిత ప్రస్థానం కూడా ఒక ఇతిహాసం. అది జిజ్ఞాసుల, చైతన్య గత ప్రాణుల అధ్యయనానికి మార్గదర్శకం.

భారతీయ సాహిత్య నిర్మాతలు
ఆరుద్ర
మేడిపల్లి రవికుమార్
వెల:40/-, పేజీలు: 143
ప్రతులకు: సాహిత్య అకాడమీ
'రవీంద్ర భవన్', 35, ఫిరోజ్‌షా రోడ్-
న్యూఢిల్లీ-110 001.

❋

3వ పేజీ తరువాయి...

ప్రవేశం ద్వారం వద్దనున్న శాసనం, రఘునాథస్వామి దేవాలయం దక్షిణ ప్రాకారం రాతిపై , ఉత్తర ప్రాకారం వద్ద శాసనాలున్నాయి.

చార్మినార్

కోటలోకి ప్రవేశించగానే ఎదురుగా పాఠశాల పక్కనే చార్మినార్ ఉన్నది. దీన్ని నాలుగు స్తంభాలపై నిర్మించారు. అప్పట్లో ఇక్కడ రాజులు పంచాయతీలు జరిపేవారని ప్రతీతి.

జైలు

చార్మినార్ పక్కనే జైలు ఉంది. ఎత్తయిన ఈ కట్టడం లోపల కందకంలో ఖైదీలను బంధించేవారు. ఈ జైలు నుండే గండికోట చివరి హిందూ రాజు అయిన తిమ్మనాయుడు కుటుంబాన్ని మీర్‌జుమ్లా బంధించాడు. అనంతరం మరణశిక్ష అమలు చేశారు.

మాధవరాయస్వామి దేవాలయం

మాధవరాయస్వామి దేవాలయాన్ని హరిహర బుక్కరాయలు అద్భుతశిల్పకళాసంపదతో కట్టించారు. ప్రధాన ప్రవేశ ద్వారంపై నాలుగు అంతస్థులతో కూడిన గాలి గోపురం ఉంది. దేవాలయం లోపలి ఆవరణం మధ్యలో అద్భుతమైన శిల్పాలు ఉన్నాయి. నైరుతి మూలలో కళ్యాణ మండపం, ఆగ్నేయమూలలో పాకశాల, అలంకారశాల, ఉత్తరాన ఆళ్వారుల ఆలయం ఉంది.

జుమ్మా మసీదు

జుమ్మా మసీదును మీర్‌జుమ్లా కట్టించాడు. కోనేరుకు ముందర ధాన్యాగారానికి పక్కగా ఉంది. ఈ మసీదు చుట్టూ బయట వైపు 30 గదులు ఉన్నాయి. వీటిని గుర్రపుశాలలుగా మీర్ జుమ్లా ఉపయోగించేవాడు. మసీదులో 64 గదులున్నాయి. మసీదు లోపలి ప్రాంతం విశాలంగా ఉంది. మసీదు ఎత్తుగా రెండు మినార్లతో నిర్మించారు. మసీదు లోపల నీటి తొట్టి ఉంది. దీనిలోకి నీరు రాయల చెరువు నుంచి వచ్చే విధంగా నిర్మించారు.

కోనేరు

కోనేరు జుమ్మా మసీదు ఎదురుగా ఉంది. దీన్ని మొదట కాకరాజు నిర్మించాడు. తర్వాత పెమ్మసాని తిమ్మనాయుడు అభివృద్ధి చేశాడు. గండికోటలోని దేవాలయాల ప్రాంతాలను ప్రజల అవసరాలకు ఉపయోగించేవారు. ఇందులో ఎప్పటికీ నీరు ఉండడం విశేషం.

ధాన్యాగారం

జుమ్మా మసీదు- రఘునాథస్వామి దేవాలయానికి మధ్యన ధాన్యాగారం ఉంది. దీన్ని మీర్‌జుమ్లా నిర్మించాడు. దీర్ఘ చతురస్రాకారంలో నిర్మించారు. అప్పట్లో అన్ని రకాల ధాన్యాన్ని నిల్వ ఉంచేందుకు ఉపయోగించేవారు. దీని గోడలు ఒకటిన్నర మీటర్ల మందంతో నిర్మించారు. పైకి ఎక్కేందుకు మెట్లు కట్టారు. దీంట్లో రెండు సంవత్సరాలకు సరిపడా ఆహారధాన్యాలు భద్రపరిచేవారు.

రఘునాథస్వామి దేవాలయం

కాకరాజు రఘునాథస్వామి దేవాలయం నిర్మించాడు. పెమ్మసాని తిమ్మనాయుడు అభివృద్ధి చేశాడు. మండపంలో చక్కని శిల్పాలు నిర్మించారు. గర్భగుడిలో విగ్రహం ఉండదు. మీర్ జుమ్లా హయాంలో ఆలయాల్లో విగ్రహాలను ఫిరంగుల తయారీకి కట్టించాడని ప్రతీతి.

పెన్నా హొయలు

పెన్నానది గండికోటకు ఉత్తర పశ్చిమ దిక్కుల్లో ప్రవహిస్తుంది. ఆ ప్రాంతంలో చూస్తే కోటకు అతి పెద్ద కందకం తవ్వినట్లుగా కనబడుతుంది. దాదాపు 300 అడుగుల లోతులో పది కి.మీ. పొడవున 300 అడుగుల వెడల్పులో పెన్నానది ఎర్రకొండల మధ్య అత్యంత సుందరంగా వంపులు తిరుగుతూ ప్రవహిస్తూ పర్యాటకులను ఆకర్షిస్తోంది.

❋

ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించాలి

ఎస్. సీతారామయ్య, ఇంటాక్ కన్వీనర్, కడప చాప్టర్.

101 బురుజులతో, కోటకు సహజసిద్ధంగా రక్షణగా రెండు కొండలను చీల్చి అగాధాన్ని సృష్టించిన పెన్నానది తీరాన కొండపై ఉన్న గండికోట ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. దాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించాలి. ప్రపంచంలో ఇలాంటి కట్టడం అమెరికాలో కూడా వుంది. ఫ్రెంచి యాత్రికుడు టావెర్నియర్ 1652 సంవత్సరంలో సందర్శించాడు. దీన్ని అద్భుతమైన కట్టడంగా అభివర్ణించాడు. దీని గుర్తింపు కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. ప్రజలు కూడా తమ ఆలోచనలను ఉత్తరాల ద్వారా దేశ ప్రధానికి తెలపాలి.

కథా నిలయం
శ్రీకాకుళం

సీరియల్

మూలం : బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)

తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

జరిగినకథ

ఒకప్పుడు వాళ్ళ దగ్గర వేలాది గుర్రాలుండేవి. ఇతర తెగలవాళ్ళు కూడా షెయెనీల అశ్వ సంపదను చూసి అసూయపడ్డారు. వాళ్ళ శరీర సౌష్టవం యురోపియన్లను కూడా ఆకర్షించింది. 'బ్యూటిఫుల్ పీపుల్" అన్నాడు. కాని త్వరలో ఈ తెగ అంతరించబోతున్నది. ఇరవయ్యేళ్ల వూచకోత తర్వాత అమెరికన్ దున్నలలాగే వాళ్ళూ కనుమరుగవుతారు.

ఈ స్వేచ్ఛా ప్రియులు మూడు రోజులు విరామం లేకుండా ప్రయాణించారు. గుర్రాలు అలసిపోతాయని కూడా ఆలోచించలేదు. సెప్టెంబర్ 14 నాడు ఫోర్ట్ రెనోకు 150 మైళ్ళు వుత్తరాన సిమారాన్ దాటారు.

అమెరికన్ డేగ

(56 భాగం)

మమ్మల్ని ఇక్కడికి తరలించిన రోజునే చెప్పారు. "ఇష్టం లేకపోతే బ్లాక్‌హిల్స్‌కు పోవచ్చునని. ఇంతకూ, మేం రిజర్వేషన్‌లో వుండటం వల్ల మీకేమి లాభం? వెళ్ళిపోతే ఏం నష్టం? తెల్లవాళ్ళ ఆస్తులు ధ్వంసం చేశామా? ఎవర్నైనా చంపామా? ఎందుకు మమ్మల్ని పశువుల్లా బంధించి వుంచుతారు? యుద్ధం చెయ్యదలచుకుంటే చెయ్యండి" అంటూ రాయబారితో కరాఖండిగా చెప్పాడు లిటిల్ వూల్ఫ్. తుపాకులే పేలితే ఇండియన్లెవరూ మిగలరు. అయినా ఇంత ధైర్యంగా, మొండిగా వాదించటమేమిటి? సైనికులకు నాయకత్వం వహిస్తున్న కెప్టెన్ జోసెఫ్ రెండెల్ బ్రాక్ కు కోపం వచ్చి ఫైరింగ్ ఆర్డరిచ్చాడు. మరుక్షణం సైనికులు అన్ని వైపుల నుండీ కాల్పులు జరిపారు. ఇదే వాళ్ళు చేసిన మూర్ఖమైనపని. ఇండియన్లు సెడార్ బోదెల వెనక నక్కారు. రాత్రంతా తుపాకులు మోగాయి. తెల్లవారు జామున, మసక చీకటిలో ఇండియన్లు చిన్న చిన్న గ్రూపులుగా విడిపోయి వుత్తర దిశగా కదిలిపోయారు. అయితే, అసలు యుద్ధం అప్పుడు ప్రారంభమైంది. అది వేట. కాన్సాస్, నెబ్రాస్కాల మీదుగా ఇండియన్లను తరిమారు. సైనికులు ప్రతి ఫోర్టు దగ్గిరా, అదనపు సైనికులు తోడై ఇండియన్లను వూపిరి పీల్చుకోనివ్వలేదు. వలాస్, హేస్, డాడ్జ్, రైలీ, కియార్నీ పోర్చుగల్ నుండి వచ్చిన సైనికులు రైలు వ్యాగన్లలో ప్రయాణించి ఇండియన్లను దొరికిన వాళ్ళను దొరికినట్టే కాల్చి చంపారు. షెయెనీల గుర్రాలు అలసి పోయి, నురగలు కక్కి కూలబడ్డాయి. అది యుద్ధం కాదు. జంతువుల వేట. సైనికులతో పాటు కౌబాయ్స్, రాంచర్స్, వ్యాపారులు కూడా ఇండియన్లను వేటాడారు. స్త్రీలు పిల్లలని కూడా చూడకుండా గుళ్ల వర్షం కురిపించారు. సెప్టెంబర్ చివరి వారంలో ఇండియన్లు, అయిదుసార్లు చిక్కినట్టే చిక్కి తప్పించుకున్నారు. "మూన్ ఆఫ్ ఫాలింగ్ లీవ్స్" సీజన్‌లో వాళ్లు యూనియన్ పసిఫిక్ రెయిల్ రోడ్ మీదుగా ప్రయాణం చేసి, ప్లాట్ నది దాటి, తమకు సుపరిచితమైన నెబ్రాస్కా పర్వతాల్ని సమీపించారు. ఎలాగైనా సరే, ఇండియన్లను నిరోధించాలని త్రీస్టార్స్ క్రూక్ మరికొన్ని దళాలను కూడా పంపాడు గాని ఆ దశలో "వాళ్లను పట్టుకోవటమంటే ఆకాశంలో ఎగిరే కాకుల గుంపును అడ్డగించటమే" అని అంగీకరించాడు.

తెల్లవారుజామున మంచు కురిసింది. ఇండియన్ టెరిటరీలో వేడి గాలులకు ఎండి పోయిన ప్రాణం చల్లగాలికి పులకరించింది. ఆరు వారాలు నిరంతర ప్రయాణంలో గుడ్డలు, బ్లాంకెట్లు పీలికల్లా తయారయ్యాయి. ఆకలిబాధ తీరలేదు. గుర్రాలు నడవలేకపోతున్నాయి.

ఒక రాత్రి క్యాంపులో ఎంత మంది చేరారో లెక్క చూసుకున్నాడు. బయల్దేరిన వాళ్లలో ముప్పై నాలుగు మంది కనిపించటం లేదు. దారి తప్పి వుండవచ్చు. అప్పుడప్పుడు సైనికులలో జరిగిన పోరాటాలలో నేల కూలి వుండవచ్చు. వృద్ధులలో కదలటానికి కూడా శక్తిలేదు. రెడ్‌క్లౌడ్ ఏజెన్సీకి వెళ్ళి కొన్నాళ్లు విశ్రాంతి తీసుకొని, ఆరోగ్యం కుదుటబడిన తర్వాత ప్రయాణం కొనసాగించాలని ప్రతిపాదించాడు డల్‌నైఫ్. తాను ఇది వరలో అతడికెంతో సహాయం చేశాడు (పౌడర్ రివర్ కంటే యుద్ధంలో షెయెనీల మద్దతు లభించకపోతే అతడు గెలిచే వాడే కాదు). అందువల్ల ఇప్పుడు ఆపదలో వున్న తమకు సహాయం చెయ్యటం అతడి బాధ్యత.

"ఎవరి దయాధర్మాల మీద ఆధారపడటమెందుకు?" అంటూ కసురుకున్నాడు లిటిల్ వూల్ఫ్. మరికొద్దిరోజులు ప్రయాణం చేస్తే టంగ్ రివర్ వాలీ చేరుకోవచ్చు. అదే షెయెనీ భూభాగం, అక్కడ కావలసినంత మాంసం దొరుకుతుంది. చలిలో కప్పుకోవటానికి జంతువుల చర్మాలు కూడా దొరుకుతాయి.

చివరికి సామరస్య పూర్వకంగా సమస్యను పరిష్కరించుకున్నారు. ప్రవేశించగలిగిన వాళ్ళు లిటిల్ వూల్ఫ్‌తో టంగ్ రివర్ వైపు పోవచ్చు. అలసిపోయిన వాళ్ళు డల్‌నైఫ్ బృందంలో చేరి రెడ్‌క్లౌడ్ ఆతిథ్యం, స్వీకరించవచ్చు. మరునాడు 53 మంది పురుషులు, 43 మంది స్త్రీలు, 38 మంది పిల్లలు లిటిల్ వూల్ఫ్ ననుసరించారు. సుమారు 150 మంది డల్‌నైఫ్ వెంట వుంటామన్నారు. వైల్డ్ హాగ్, లెఫ్ట్ హాండ్ కూడా తన భార్యా పిల్లల్ని వదిలి వుండలేక, డల్‌నైఫ్‌లో చేరారు. వీళ్ళే చివరి "బ్యూటిఫుల్ పీపుల్"!

అక్టోబర్ 23 నాడు, డల్‌నైఫ్ బృందం, ఫోర్ట్ రాబిన్సన్‌కు రెండు నిద్రల (రెండురోజుల ప్రయాణం) దూరంలో వున్నప్పుడు మంచు తుఫానులో చిక్కుకుంది. కళ్లముందు మంచు పరదా తప్ప మరేమీ కనిపించలేదు. నల్లటిగుర్రాలు కూడా శ్వేతాశ్వాలుగా మారాయి. కన్ను పొడుచుకున్నా కనిపించని ఆ ప్రకృతి బీభత్సంలో కెప్టెన్ జాన్. బి. జాన్సన్

నాయకత్వంలో అశ్విక దళం వాళ్లను చట్టుముట్టింది.

ఈసారి ఇండియన్లు తప్పించుకునే అవకాశం లేదు. కాల్పులు ప్రారంభించటానికి ముందు ఒక దూతను పంపాడు కెప్టెన్. డల్‌నైఫ్‌కు కూడా యుద్ధంచేసే ఓపిక, ఆసక్తీ లేవు. రెడ్‌క్లౌడ్ లేదా స్పాటెడ్ టెయిల్‌ల నివాసాలకు చేరగలిగితే ఆశ్రయం దొరుకుతుందన్నదే కోరిక.

"రెడ్‌క్లౌడ్, స్పాటెడ్ టెయిల్ మరింత వుత్తరంగా వెళ్ళిపోయాడు" దకోటా ఒప్పుడు వాళ్ళ స్థావరం నెబ్రాస్కాలో రిజర్వేషన్‌ను మూసేశారు. మీరిష్టపడితే ఫోర్ట్ రాబిన్సన్‌కు రండి" అని నచ్చ చెప్పటానికి ప్రయత్నించాడు కెప్టెన్.

డల్‌నైఫ్ మొదట నిరాకరించాడు గాని సాయంత్రం వరకు మంచు తుఫాను ప్రాణాంతకంగా పరిణమించింది. ఒక వైపు ఆకలి. మరోవైపు ఎముకలు గడ్డకట్టే చలి. గత్యంతరం లేక సైనికుల రక్షణలో ఫోర్టుకు పయనమయ్యారు ఇండియన్లు.

చీకటి పడింది. ఒక క్రీక్ వద్ద క్యాంపు ఏర్పాటు చేసుకున్నారు సైనికులు. షెయెనీలు స్వచ్ఛందంగానే వెంట వస్తున్నారు. అయినా పారిపోతారనే భయంతో కొంత మంది వాళ్లకు కాపలావున్నారు. ఇండియన్లలో వుత్కంఠ పెరిగింది. ఫోర్టుకు చేరిన తర్వాత తమకేం విధిస్తారు? సైనికులు ఎలాగైనా ఆయుధాలు స్వాధీనం చేసుకుంటారు. ఇవన్నీ వాళ్ళకెందుకివ్వటం? తామే ధ్వంసం చేస్తే సరి. ఒక్కొక్క గన్ను తీసుకొని విడగొట్టి భాగాలు చెల్లా చెదరుగా పడేశారు. మరికొన్ని స్త్రీల దుస్తుల్లో దాచారు. మరునాడు, కెప్టెన్ జాన్సన్, ఆయుధాల కోసం అడిగినప్పుడు తుపాకీ గొట్టాలు మాత్రమే చూపించారు ఇండియన్లు.

అక్టోబర్ 25 నాడు ఈ బృందం ఫోర్ట్ రాబిన్సన్ చేరుకుంది. 75 మంది సైనికుల కోసం కలపతో నిర్మించిన బరాక్స్ ఒకటి ఇండియన్లకు కేటాయించాడు కెప్టెన్. అందులో 150 మంది సర్దుకోవాలి. అయితేనేం ఎట్టకేలకు వెచ్చగా పడుకోవచ్చు. బ్లాంకెట్లు, కడుపునిండా భోజనం, మందులు కూడా అందుబాటులో వుంచారు. ఇంతకన్నా ఇంకేం కావాలి? గార్డులు కూడా స్నేహితుల్లా, కలుపుగోలుగా వ్యవహరించారు.

పోర్టుల్లో సుఖంగానే వుంది గాని తమ వాళ్లను కలుసుకోవటమెప్పుడు? రెడ్‌క్లౌడ్ వద్దకు వెళ్లటానికి అనుమతివ్వమని ప్రతిరోజూ పోస్ట్ కమాండర్ మేజర్ కాలెబ్ కార్లటన్‌ను వేధించాడు డల్‌నైఫ్. వాషింగ్టన్ నుండి ఆదేశాలు వచ్చినప్పుడే అవి సాధ్యం. అయితే కార్లటన్‌కు షెయెనీలంటే చాలా ఇష్టం. రోజూ కొద్ది మంది మైదానాల్లోకి వెళ్ళి వేటాడి రావటానికి అభ్యంతరం చెప్పలేదు. అలా వెళ్ళిన వేటగాళ్లకు గుర్రాలూ, తుపాకులు కూడా సప్లై చేశాడు. శీతాకాలం గనక, జంతువులు కనిపించక నిరాశతో తిరిగి వచ్చారు షయెనీలు. మైదానాలిప్పుడు పూర్తిగా మారిపోయాయి. తమ వాళ్ళ గుడారాలు కూడా లేవిప్పుడు. ఇండియన్లకు కావలసింది స్వేచ్ఛగా తిరగటం. ఆ కోరిక మాత్రం తీరింది.

"మూన్ వెన్ ది వూల్ఫ్స్ రన్ టుగెదర్" సీజన్ ప్రారంభంలో మేజర్ కార్లటన్ స్థానంలో కొత్త కమాండర్ కెప్టెన్ హెన్రీ డబ్లు వెసెల్స్ ఫోర్టు నిర్వహణ బాధ్యతలు చేపట్టాడు (అతణ్ణి, ఫ్లైయింగ్ డట్‌మూన్' అంటూ పిలిచే వాళ్ళందరూ). అతడు మహా అనుమానం మనిషి. షెయెనీల మీద నిఘా పెంచాడు. తనకు తెలియకుండా వాళ్ళు ఎక్కడికీ వెళ్ళకూడదు. ఏపనీ చెయ్యకూడదు. షెయెనీలలో అసహనం పెరిగింది. మరి కొన్నాళ్లాగితే ఏం చేసేవాళ్ళో గాని, ఆ డిసెంబర్‌లో దకోటా నుండి రెడ్‌క్లౌడ్‌ను పిలిపించి ఓ సమావేశం ఏర్పాటు చేశారు అధికారులు.

"మిమ్మల్ని చూస్తే మా గుండె తరుక్కు పోతున్నది. మనం కలసి యుద్ధాలు చేశాం. మా కోసం మీరు ప్రాణత్యాగాలు చేశారు. కాని పరిస్థితులు మనకనుకూలంగా లేవు. వాషింగ్టన్‌లో వున్న గ్రేట్‌ఫాదర్ ఆదేశాల ప్రకారమే మనం నడుచుకోవాలి. మిమ్మల్ని మా రిజర్వేషన్‌కు రానివ్వమని ఆయనకు అర్జీ పెట్టుకున్నాం. అనుమతిస్తే అందరం కలిసే వుందాం. మీరు మాకు ఆప్తులు. మాకున్నదేదో మీతో పంచుకోవటం మాకూ ఆనందమే. కాని ఒక విషయం మాత్రం బాగా గుర్తుంచుకోండి. మన యిష్టాయిష్టాలు ముఖ్యం కాదు. అధికారుల ఆజ్ఞలకు లోబడే ఏపనైనా చేయాల్సి వుంటుంది. మంచు దట్టంగా కురుస్తున్నది. గుర్రాలు చిక్కిపోయి ఎముకలు తేలాయి. వేట జంతువుల కొరత ఏర్పడింది. వాతావరణం ఇలా వున్నంత కాలం కొండల్లో బతకలేం. గ్రేట్ ఫాదర్ మన రక్షకుడు...."

రెడ్‌క్లౌడ్ చాలా మారిపోయాడని షెయెనీల కర్థమైపోయింది. పిరికిపందలా మాట్లాడుతున్నాడు. వయసు మీద బడింది. స్వచ్ఛందంగా జైలు జీవితాన్ని అనుభవిస్తున్న వ్యక్తిలా వున్నాడతడు. దకోటా రిజర్వేషన్ ఒక పెద్ద బందిఖానా కాబోలు.

"మాకు శాంతి కావాలి. యుద్ధం చెయ్యాలని లేదు. మమ్మల్నిక్కడే వుండనివ్వండి. దక్షిణంగా పంపిస్తామంటే మాత్రం మిమ్మల్ని చంపి మేమూ చస్తాం" అంటూ వెసెల్స్‌తో మొర పెట్టుకున్నాడు డల్‌నైఫ్.

నెల రోజుల తర్వాత, 1879, జనవరి3 నాడు వార్ డిపార్ట్‌మెంట్ నుండి వెసెల్స్‌కో సందేశం వచ్చింది. జనరల్ షెరిడాన్,

ఒక షెయెనీ యోధుడు, జైలు కప్పగా వున్న కలపదుంగను లాగి పట్టుకున్నాడు. దుస్తుల్లో దాచుకుని తెచ్చిన తుపాకుల గొట్టాలు కూడా సిద్ధంగా వున్నాయి. మిగతా పరికరాలు పోగు చేసి 'గన్' అసెంబుల్ చెయ్యటం వాళ్ళకు తెలుసు. సుత్తెలు, తూటాలు కూడా వున్నాయి. రెండు మూడు గంటల్లో ఆయుధాలు సిద్ధమయ్యాయి. యువకులు మొహాలకు రంగు పులుముకుని కొత్త దుస్తులు తొడుక్కొని పారిపోవటానికి సిద్ధంగా వున్నారు. స్త్రీలు, బట్టల మూటలు వీపులకు కట్టుకుని నాయకుని సైగ కోసం నిరీక్షించారు. గార్డులను గురి చూసి పిస్టల్ పేల్చితే ఆ తర్వాత పలాయనమే.

బిగ్ రోస్ షర్జ్ దానిమీద సంతకాలు చేశారు. "డల్‌నైఫ్‌నూ ఇతర షెయెనీలనూ తక్షణం దక్షిణంగా తరలించకపత్పదు."

వార్ డిపార్ట్‌మెంట్ ఆజ్ఞలను వుల్లంఘించటానికి విల్లేదు. సందేశంలోని "తక్షణం" అనే మాట వెసెల్స్‌కు చిక్కులు తెచ్చి పెట్టింది. అది "మూన్ వెన్ ది స్నో డ్రిఫ్ట్స్ ఇంటు ది చెపీస్" కాలం, మంచు తుఫానులు వీస్తున్నాయి. ఆ వాతావారణం ప్రయాణాలకు అనుకూలించదు.

"ఆజ్ఞల గురించి విని, "మేం చావాలా ఏమిటి? అంత దూరం నడిచివెళ్ళి చావటమెందుకు? ఇక్కడే చస్తాం" అన్నాడు. డల్‌నైఫ్.

తన విచక్షణాధికారం వుపయోగించి అయిదు రోజులు టైమిస్తానన్నాడు వెసెల్స్. ఈ ఐదు రోజులూ వాళ్లకు రేషన్ ఇవ్వరు.

ఏం జరుగుతున్నదో వూహించలేకపోయారు షెయెనీలు. రాత్రింబగళ్లు నిరంతరాయంగా మంచు కురిసింది. బారక్స్‌లో తాగటానికి నీళ్లు కూడా లేవు. మంచు కరిగించుకొని దాహం తీర్చుకున్నారు. మాంసం లేదు. బొమికలనే చీకి, నమిలి తృప్తి పడ్డారు. మొహం మీదా, చేతుల మీదా మంచు పేరుకుని పుండ్లు పడ్డాయి.

జనవరి9 నాడు షెయెనీలను తన ఆఫీసుకు పిలిపించి చివరి ఆదేశాలిచ్చాడు వెసెల్స్. డల్‌నైఫ్ వెళ్ళనన్నాడు. వైల్డ్ హాగ్, క్రో, లెఫ్ట్ హ్యాండ్‌లను సైనికులు బలవంతంగా లాక్కెళ్లారు. ఆ తర్వాత రెండు చేతులకూ సంకెళ్లతో పరిగెత్తుకుని వచ్చాడు. ఏం జరుగుతుందో తెలియక ఇతర షెయెనీలు భయభ్రాంతులయ్యారు. "దక్షిణంగా వెళ్లం" అంటూ బిగ్గరగా అరిచాడు వైల్డ్‌హాగ్, వెంటనే అతణ్ణీ గొలుసుల్లో బంధించారు. తిరగబడిన ఇతరులను కూడా తీవ్రంగా కొట్టి గాయపరిచారు.

ఇంకా వుంది....

అలాంటి పాత్రలు పది చాలు...

చందు



సినీ నటుడు నరేష్ చెబుతున్న కబుర్లు

ఎస్వీ రంగారావుగారు, శివాజీగణేశన్, నసీరుద్దీన్ షా, కమల్‌హాసన్... ఇలా కొంతమంది నా రోల్ మోడల్స్ వున్నారు. వీరిలా విభిన్న పాత్రలు పోషించాలని ఉండేది. డిఫరెంట్ క్యారెక్టర్స్ చేసే అవకాశం రాకపోవడం... రొటీన్‌గా నటించలేకపోవడంతో రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటిద్దామనుకున్నప్పుడు అవకాశాలు రాలేదు. 'హీరోగా చేసి, క్యారెక్టర్ పాత్రలు ఏం చేస్తారు?' అని అనుకున్నారు కాబోలు! అవకాశాలకు దూరంగా ఉంచారు.

చిన్నప్పుడు 'వందేమాతరం....' గీతం వింటే ఎందుకో తెలీదుగానీ, కళ్లెంట నీళ్ళొచ్చేవి. 'అల్లూరి సీతారామరాజు' సినిమా ఇప్పటికి 100 సార్లకు పైగా చూసుంటా. ఇంకా చూస్తూనే వుంటా. నేను చదివిన కాన్వెంట్లు చాలా ట్రెడిషనల్‌గా ఉండేవి. హిందూ భావజాలం ఉన్న కాన్వెంట్లనుకోండి. పెరిగిన వాతావరణ ప్రభావం నా ప్రవర్తనపై చూపింది. జీవిత గమనాన్ని నిర్దేశించింది. ఓ రోజు వెంకయ్యనాయుడుగారు అమ్మకు ఫోన్ చేసి 'అబ్బాయి పార్టీలోకి వస్తే బాగుంటుంది. మంచి భవిష్యత్ ఉంటుంది' అన్నారు. 'మాకేమీ అభ్యంతరం లేదు. అబ్బాయి ఇష్టం' అన్నారు. అలా బి.జె.పి.లో చేరాను. ఐదేళ్లపాటు సినిమాలకు దూరంగా ఉండి పార్టీకి పని చేశా. నక్సల్ ఏరియాలో పాదయాత్ర చేసి పరిస్థితుల స్థితిగతులు ఆకలింపు చేసుకున్నా. వెనుకబడిన ప్రాంతానికి జీవితం అంకితం చేయాలన్న నిర్ణయానికి వచ్చాను. ఈ భోగభాగ్యాలు కొంతవరకే. జన్మను సార్థకత చేసుకోవాలన్న సిద్ధాంతానికి వచ్చా. గౌతముడు బుద్ధుడైనట్లు... పాదయాత్రతో నాలో మార్పొచ్చింది. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం మూడుసార్లు వచ్చింది. రాజకీయపరంగా నేను వేసుకున్న బేస్ చాలా పెద్దది. ఈక్రమంలో ఎన్నికల్లో పోటీ చేసి గెలవడమనేది చాలా చిన్నది. ఎన్నికల్లో పోటీ చేయాలంటే, ముందు నాకు నచ్చిన ప్రాంతంలో సేవ చేసి వుండాలి. ఆ తర్వాత ఆ ప్రాంతానికి నా జీవితం అంకితం చేసి వుండాలి. అయినా పార్టీ ఆదేశానుసారం నడుచుకోవాల్సి ఉంటుంది. నా జీవితంలో రాజకీయం అనేది ఒక భాగం మాత్రమే. నాలో మరో రెండు కోణాలున్నాయి. ఒకటి సినిమా, రెండు 'ఐడియాస్' అనే స్వచ్ఛంధ సంస్థకు నేను ప్రెసిడెంట్‌గా ఉన్నాను. ఈ సంస్థ రాయలసీమలో సుమారు 3,500 మంది పేదవారికి ఇన్సూరెన్స్ చేయించింది. అలాగే మరో జాతీయ సంస్థకు నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌ని. స్వచ్ఛంద సంస్థలు బాగా పని చేస్తే ప్రభుత్వానికి సగం భారం తగ్గిపోతుందన్న కాన్సెప్ట్‌తో ప్రమోట్ చేస్తున్నాం. సినిమాలకు తొలి ప్రాధాన్యత ఇస్తాను. షూటింగ్ లేదంటే గ్రామాలకు పోయి చెట్ల కింద కూర్చొని మంచీచెడ్డా మాట్లాడుతూ ఉంటాను.

పుస్తకాల పురుగులుగా మార్చేస్తున్నారు

భారతీయ సంప్రదాయం మన దేశానికే గర్వ కారణం. నేడది కనుమరుగై పోతోంది. విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టిపోయింది. దీనికి తల్లిదండ్రులే ప్రధాన కారకులు. ఫారిన్ పంపించేసి నా కొడుకు ఎన్.ఆర్.ఐ అని చెప్పుకోవాలన్న ఉబలాటం ఎక్కువైపోయింది. ఈక్రమంలో తమ పిల్లల్ని పుస్తకాల పురుగులుగా మార్చేస్తున్నారు. మేం చదువుకునే రోజుల్లో... స్టూడెంట్స్ ఆత్మహత్యలు చేసుకోవడం ఎక్కడా వినలేదు. నేడవి పెరిగిపోయాయి. పురాణాల్లో ఏ క్యారెక్టర్ ఏమిటో చాలామంది పిల్లలకు నేడు తెలీదు. వారానికి ఒక వేదా క్లాస్ పెట్టి పురాణ జ్ఞానాన్ని అందించొచ్చు కదా! గాంధీగారు రాట్నం ఒడికేవారని చదువుకునేవాళ్ళం. హ్యాండ్ క్రాఫ్ట్ పేరుతో పిల్లలకది నేర్పించొచ్చు కదా! అని అప్పుడప్పుడూ అనుకుంటూ ఉంటాను. విద్యా వ్యవస్థ మారాలి.

నాకు ఇద్దరు పిల్లలు. పెద్దాడి పేరు నవీన్. చీఫ్ ఎడిటరయ్యాడు. పెద్ద పెద్ద చిత్రాలన్నీ వాడే చేస్తున్నాడు. మంచి డిమాండ్ ఉంది. సినిమా ప్రోమోలు చేయడంలో మంచి ఎక్స్‌పర్ట్. వాడు తీసిన షార్ట్ ఫిలింస్ ఫారిన్ ఫిలింస్ ఫెస్టివల్స్‌కు వెళ్ళాయి. వాడి జీవితంలో ఎడిటింగ్ ఒక మజిలీ మాత్రమే. త్వరలో డైరెక్షన్ చేస్తాడు. చిన్నోడు తొమ్మిది చదువుతున్నాడు. అందంగా బొమ్మలేస్తాడు.

..... రిటైరైపోతా

ఎస్వీ రంగారావుగారు, శివాజీగణేశన్, నసీరుద్దీన్ షా, కమల్‌హాసన్... ఇలా కొంతమంది నా రోల్ మోడల్స్ వున్నారు. వీరిలా విభిన్న పాత్రలు పోషించాలని ఉండేది. డిఫరెంట్ క్యారెక్టర్స్ చేసే అవకాశం రాకపోవడం... రొటీన్‌గా నటించలేకపోవడంతో రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటిద్దామనుకున్నప్పుడు అవకాశాలు రాలేదు. 'హీరోగా చేసి, క్యారెక్టర్ పాత్రలు ఏం చేస్తారు?' అని అనుకున్నారు కాబోలు! అవకాశాలకు దూరంగా ఉంచారు. హీరోగా నటిస్తున్నప్పుడు కూడా... నన్ను 'హీరో' అనొద్దు, 'యాక్టర్' అని మాత్రమే పిలవండనేవాణ్ణి. 'స్టార్' అనే వాడు చనిపోతాడుగానీ, 'యాక్టర్'కి చావు లేదు. ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయేవాడు యాక్టర్ మాత్రమే. సెకండ్ ఇన్నింగ్స్‌లో 'అల్లరి రాముడు'లో నగ్మాకు జోడీగా నటించాను. మంచి పేరొచ్చింది. 'యమదొంగ'లో నారదుడుగా గుర్తింపు పొందాను. 'శ్రేయోభిలాషి'లో పాత్ర విన్నప్పుడు 'దీని కోసమే ఇంకా బతికున్నా' అనుకున్నా. 'చిత్రం భళారే విచిత్రం' తర్వాత అంతగా నిలబెట్టిన చిత్రం 'మీ శ్రేయోభిలాషి'. జీవితంలో ఇలాంటి విభిన్న పాత్రలు పది చేస్తే చాలు. ఇక రిటైరైపోతా.

✲

ఆ డబ్బులు చార్జీలకే సరిపోయేట్టున్నాయ్

న్యాయవాది జి.ఎల్.నరసింహారావు గార్కి నమస్కారం. మేము రైతులం. శనక్కాయల విత్తనాలను పేరున్న పెద్ద కంపెనీ దగ్గర తీసుకుంటే అవి మొలవలేదు. మేం వినియోగదారుల కోర్టులో కేసు వేసినాం. మా గ్రామంలో ఇరవై మంది రైతులకు వారు తీసుకున్న దానిని బట్టి రూ.లు 10,000/- నుండి 50,000/- వరకు వచ్చాయి. కంపెనీ వారు హైదరాబాద్ కోర్టులో వేసినారని ... సగం పైసలు మేం అక్కడికి వచ్చి తీసుకోవాలని ఉత్తర్వులు వచ్చాయి. 10 వేల కోసం మేం అక్కడికి రావాలా? మళ్లీ లాయరుని పెట్టుకోవాల్సిందేనా? వారిచ్చే డబ్బులు లాయరు ఫీజులకీ, చార్జీలకీ సరిపోయేటట్లున్నాయి. మమ్మల్ని ఏం చేయమంటారు? సెలవివ్వండి?

- రాజశేఖర్, అనంతపురం.

మీరు జిల్లా ఫోరంలో గెలుపొందారు కావున స్టేటు ఫోరంలో కూడా గెలిచే అవకాశం ఉంటుంది. కంపెనీ వారు ఏ గ్రౌండు కింద స్టేటు ఫోరంలో వేశారో పరిశీలిస్తేనేగాని విషయం తెలియదు. మీరు మళ్లీ లాయరుని హైదరాబాద్‌లో కూడా పెట్టుకోవలసిందే. లేదంటే మీరుగాని, మీ లాయరుగాని న్యాయసేవ సదన్‌ని సంప్రదించినా వారు మీకు లాయరుని ఏర్పాటు చేస్తారు. మీరు వాదనలు వినిపించ లేరు కావున లాయరుని పెట్టుకోకపోతే నష్టపోయే అవకాశం ఉంటుంది. కావున మీరు లాయరుని సంప్రదించవలసిందే.

కేసు మా ఊళ్లో వేసుకోకూడదా!

సలీంతో మా చెల్లికి 2006లో మహ్మదీయ పద్ధతిలో వివాహం జరిగింది. పిల్లవాడు ఖమ్మంలో ఉంటాడు. 15 నెలలు మంచిగానే చూసుకుని తరువాత చాలా బాధలు పెట్టడం మొదలు పెట్టాడు. దాంతో మా చెల్లెలు అక్కడ ఉండలేక మా తల్లి గారింటికి వచ్చింది. ఖమ్మంలో అతడు కేసు వేశాడు. మేము ఖమ్మం వెళ్లవలసిందేనా? మేము ఇక్కడ కోర్టులో కేసు వేయవచ్చా? పోలీసుల వద్ద కేసు వేయవచ్చా? తెల్పగరు!

- ఫరీదా, హైదరాబాద్.

పెద్ద మనుషుల వద్ద పరిష్కారం జరగవచ్చేమో ఒకసారి పరిశీలించండి. పెద్దల జోక్యంతో కానట్లయితే కోర్టులో కేసు వేసుకోవలసివుంటుంది. మిమ్మల్ని బాధ పెట్టినందుకు క్రిమినల్ కేసు పెట్టవచ్చును. అతడు ఖమ్మంలో వేసిన కేసు ఏమిటో చెప్పలేదు. భార్య కావాలని వేశాడా? విడాకులకని వేశాడా? తెలుసుకోండి. అక్కడికి మీరు, మీ చెల్లి వెళ్లలేకపోతే హైకోర్టులో వేసి ఆ కేసు హైదరాబాద్‌కు మార్పించుకోవచ్చు. భరణం కోసం కూడ కేసు వేసుకుని డబ్బులు కూడా పొందవచ్చు. అక్కడ ఉన్న కేసు విషయాలు తెలుసుకోండి. మీరు వెళ్లనట్లయితే మీ పరోక్షంలో కేసు జరగే అవకాశం ఉంటుంది. మీ వాదన వినిపించక పోతే నష్టపోయే అవకాశం ఉంటుంది.

జి. ఎల్. నరసింహారావు
హైకోర్టు న్యాయవాది, 9848994240

ముదురు



కుర్చీలో బూర



హాయ్ పిడుగులూ! ఈ వారం మీకోసం ఒక ఆట తీసుకొచ్చాం. అదేంటనుకుంటున్నారు! 'కుర్చీలో బూర' ఆట. 'అదేంటి ఆట పేరు అలా వుంది?' అనుకుంటున్నారు కొందరు చిన్నారులు. కానీ ఆడుతుంటే భలే బావుంటుంది. మరి వివరాల్లోకి వెళ్లిపోదామా.

ఆటగాళ్ల వయస్సు: 6-8 సంవత్సరాలు

సమయం: 5 నిముషాలు

ఏమేం కావాలి?

ఎంతమంది ఆటగాళ్లుంటే అన్ని బూరలు-కుర్చీలు, పెద్దవాళ్లు ఒకరు.

ఎలా ఆడాలంటే...

ముందు కుర్చీలను వరుసగా వేయాలి. అయితే ఒకటి అటు, ఒకటి ఇటు తిప్పి వేయాలి. బొమ్మలో వున్నట్టన్నమాట. తర్వాత బూరలను ఊదాలి. ఇంక... ఒక్కో కుర్చీలో ఒక్కో బూరను దారంతో కట్టాలి. ఇప్పడు పిల్లలంతా కుర్చీల చుట్టూ మెల్లగా పరిగెడుతుండాలి. మధ్యలో పెద్దవాళ్లు గబుక్కున 'స్టాప్' అంటారు. అప్పడు పిల్లలంతా కుర్చీల్లో కూర్చోవాలి. అయితే అదే సమయంలో కుర్చీలో వున్న బూరను పగులగొట్టాలి. అందుకు చేతులు ఉపయోగించకూడదు. గబుక్కున కూర్చుని బూర పగలగొట్టాలి. కూర్చునే సమయంలో చేతులు పైకి ఎత్తి వుంచాలి. మొట్టమొదట ఎవరైతే బూర పగలకొడతారో వారు గెల్చినట్టు. ఏంటి ఆట బావుందా! మరి బూరలు కొనుక్కొచ్చుకోండీ... ఆట ఆడాలికదా!

\- సాహిల్

చుక్కలు కలిపేద్దాం

s	e	p	t	e	m	b	e	r
a	u	g	u	s	t	a	m	d
a	z	n	b	r	a	p	a	e
z	j	a	n	u	a	r	y	c
x	j	u	n	e	x	i	j	e
m	a	r	c	h	m	l	u	m
o	c	t	o	b	e	r	l	b
f	e	b	r	u	a	r	y	e
q	n	o	v	e	m	b	e	r

పన్నెండు నెలలు ఎక్కడున్నాయో...

హాయ్ బుజ్జాయిలూ... పై అక్షరాల్లో 12 నెలల పేర్లు వున్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టాలి. మరి రెడీనా!

నిలయం
ళం

బాలనేస్తాలు

రాకెట్‌ను చేరేదెలా!



పదిహేను తేడాలు గుర్తించాలోచ్





చిన్నారి చిత్రకారులు





సూరారపు రఘు తేజారెడ్డి, చిలకలూరి పేట,
ఎన్‌టిఆర్ కాలనీ రెండవ వీధి, గుంటూరు.

ఎం. అవినాష్,
10వ తరగతి,
ఎస్.ఎస్.యు.పి.
స్కూల్
కంచారం,
శ్రీకాకుళం.



జి. దయాకర్, 6వ తరగతి,
సాంఘిక సంక్షేమ
గురుకుల పాఠశాల
ఇబ్రహీంపట్నం,
రంగారెడ్డి.



అట్టమీది కథ

గీతావాణి



ఒక్కొక్కరికి
ఒక్కో అభిరుచి వుంటుంది. కొందరి
అభిరుచులు వారికి మాత్రమే ఆనందాన్నిస్తాయి.
మరికొందరి అభిరుచులు అందరికీ ఉపయోగపడతాయి. దేశ
చరిత్రను భావితరాలకు అందిస్తాయి. రెండవ కోవకు చెందినవాడే
మూడవ సాలార్‌జంగ్ (1889 జూన్ 13- 1949 మార్చి 2).
ఆయనకు దేశవిదేశాలకు చెందిన వస్తువులను సేకరించే అలవాటుంది.
ఈ అలవాటే ...పురాతన చరిత్రను, అపురూప కళాఖండాల అందాలను
ఎంతోమందికి పరిచయం చేస్తోంది. విజ్ఞానాన్ని, వినోదాన్ని
పంచుతోంది. ఆనాటి సంస్కృతి సంప్రదాయాల వివరాలను
నేటితరానికి అందిస్తోంది. అందుకు నిలువెత్తు నిదర్శనమే
సాలార్‌జంగ్ మ్యూజియం.
ఆ విశేషాలేంటో చూద్దామా!

రెబెకా

సాలార్‌జంగ్ మ్యూజియం అద్భుతం... అపూర్వం

యూసఫ్ అలీ ఖాన్ మూడవ సాలార్‌జంగ్ నిజాం ప్రభువుల వద్ద ప్రధానమంత్రిగా చేశాడు. సాలార్‌జంగ్ అనేది నిజాం ప్రభువులు వారికి ఇచ్చిన బిరుదు. ఈయనకు వస్తువులను సేకరించడమంటే ఎంతో మక్కువ. అందుకోసం తన సంపాదనలో ఎక్కువభాగం ఖర్చుచేశాడు. ఐరోపా, మధ్య ఆసియాలోని సుమారు 36 దేశాల నుండి సేకరించిన 43000 వస్తువులను, 50000 పుస్తకాలు, తాళపత్ర గ్రంథాలను సాలార్‌జంగ్ మ్యూజియమ్‌లో ప్రదర్శనకు ఉంచారు. అయితే ప్రస్తుతం మనం చూస్తున్నది వాటిల్లో 20 శాతం కళాఖండాలనే. వీటిలో ఇటలీ శిల్పి చేతిలో రూపుదిద్దుకున్న 'రెబెకా', ఇంగ్లాండు నుండి తీసుకొచ్చిన 'మ్యూజికల్ గడియారం', ఫ్రాన్స్ నుండి సేకరించిన 'మెఫిస్టోఫిలస్- మార్గరెట్టా' విగ్రహాలు ప్రధానమైనవి. ఇవేకాకుండా దంతపు కుర్చీలు, దంతాలను దారాలుగా తీసి అల్లిన చాప, వజ్రవైఢూర్యాలు పొదిగిన కత్తులు...గాజు వస్తువులు...ఇలా ఎన్నో అద్భుత కళాఖండాలకు నిలయం సాలార్‌జంగ్ మ్యూజియం. నూర్జహాన్ పండ్లను కోసుకునేందుకు ఉపయోగించిన వజ్రవైఢూర్యాలు పొదిగిన కత్తినీ ప్రదర్శనలో ఉంచారు. టిప్పుసుల్తాన్ తలపాగాలు, ఆయన





భద్రతా చర్యలు...

మ్యూజియంలోని అపురూపమైన కళాఖండాలపై కాలుష్య ప్రభావం పడుతోందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. అంతే కాకుండా ఖ్యాతిగాంచిన అంతర్జాతీయ మ్యూజియాల్లో వస్తువుల స్థలాలను మారుస్తూ కొత్తదనం కల్పిస్తుంటారు. దీనివల్ల ఎక్కువమంది ఆకర్షితులవుతుంటారు. అయితే సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన వస్తువులు దశాబ్దాల తరబడి కదలకుండా ఉంచుతున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల వాటి కింది భాగ సహజత్వం దెబ్బతినే అవకాశమూ లేకపోలేదని అంటున్నారు. కానీ కళాఖండాలను భద్రంగా వుంచడానికి మ్యూజియమ్ సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారు. ఇందుకు ప్రత్యేకంగా ఉద్యోగులు వున్నారు. ఎప్పటికప్పుడు వాటిని పరిశీలిస్తుంటారు. సూక్ష్మ రంధ్రాలు పడినా...చిన్న తేడా వచ్చినా వెంటనే వాటిని కెమికల్ కన్సర్వేషన్ ల్యాబ్‌కి పంపించి తగు జాగ్రత్తలు తీసుకుంటారు. ఇందులో భాగంగానే ప్రతి వస్తువు మీదా దుమ్ము నిలవకుండా పల్చటి బట్టతో శుభ్రం చేస్తారు. సందర్శకులు వాటిని తాకకుండా చర్యలు తీసుకుంటారు. వీలైనంత వరకు కళాఖండాను షోకేస్‌లో వుంచారు. కొన్నిటికైతే రైలింగ్ ఏర్పాటు చేశారు.





ఉపయోగించిన కుర్చీ కూడా ఇక్కడ దర్శనమిస్తుంది. ఔరంగజేబు ఖడ్గం, నూర్జహాన్, జహంగీర్, షాజహాన్ వాడిన కత్తులు కూడా వున్నాయి.

ఎన్నెన్నో కళాఖండాలు

సాలార్‌జంగ్ మ్యూజియం హైదరాబాద్‌లో వుంది. ఇది మన దేశంలోని ప్రసిద్ధిగాంచిన మ్యూజియమ్‌లలో మూడవది. ఇందులో మొత్తం 36 గ్యాలరీలున్నాయి. ఇవి రెండు అంతస్థులలో మనకు దర్శనమిస్తాయి. చార్మినార్, జుమామసీద్, హైకోర్ట్, స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ...వంటి ప్రముఖమైనవన్నీ మ్యూజియమ్‌కు ఒకటిరెండు మైళ్ల దూరంలోనే వున్నాయి. మొదట దివాన్‌దేవిడీలో మ్యూజియమ్ ఏర్పాటు చేశారు. దీనిని 1951 (డిసెంబర్) లో అప్పటి మన ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ ప్రారంభించి అద్భుత కళాఖండాలను దేశ ప్రజలకు అందించారు. అయితే సాలార్‌జంగ్ సేకరించిన వస్తువుల్లో ఎక్కువభాగం కొన్నవికాగా, మరికొన్ని బహుమతుల కింద అందుకున్నవి. అందులో అత్యంత ప్రధానమైన మేలిముసుగు సుందరాంగి 'రెబెకా, మ్యూజికల్ గడియారాలను' సేకరించింది మాత్రం మొదటి సాలార్‌జంగ్. వీటితో పాటు 14, 15, 16 శతాబ్దాలకు చెందిన విగ్రహాలూ ఉన్నాయి. రెబెకా విగ్రహాన్ని ఇటలీ శిల్పి రూపొందించగా మ్యూజికల్ గడియారానికి సంబంధించిన వస్తువులను ఇంగ్లాండు నుండి తీసుకొచ్చి కలకత్తాలో బిగించారు. ఇవే కాకుండా ఫ్రాన్స్‌కు చెందిన 16వ లూయి టిప్పుసుల్తాన్‌కు బహూకరించిన దంతపు కుర్చీలు ఉన్నాయి. వీటిలో టిప్పుసుల్తాన్ తన వస్తువులపై వాడే పెద్దపులి నమూనా కూడా ఉంటుంది. ఫ్రాన్స్‌కు చెందిన ఒకే విగ్రహంలో రెండు రూపాలుగా మలిచిన మెఫిస్ట్రోఫిలస్-మార్గ్రెట్టా విగ్రహాల అందాన్ని చూడాల్సిందే తప్ప వాటిని వర్ణించలేము. అంతేకాకుండా రామాయణ, మహాభారత ఇతిహాసాలను తెలిపే కళాకృతులు ఉన్నాయి. శివపురాణం గురించి తెలిపే ఏకైక కళాకృతి ఉన్నది సాలార్‌జంగ్ మ్యూజియంలోనే. దంతపు విభాగంలోకి వచ్చేటప్పటికి ఏనుగు దంతంపై ఎందరో మహావీరులను మలిచిన తీరు అద్భుతం. దంతాలతో చేసిన కత్తుల ఒరలు, పేటికలు, బొమ్మలు, చదరంగం బోర్డు, పావులు ఎంతో అద్భుంతా ఉంటాయి. లండన్‌కు చెందిన సోలింజన్, హెన్రీ మెల్కిన్‌సన్ పాల్‌మాల్ కంపెనీలు తయారు చేసిన ఆయుధాలూ ఉన్నాయి. 14, 15, 16 ఫ్రాన్స్ చక్రవర్తులు... లూయి, నెపోలియన్ వాడిన వస్తువులూ ఉన్నాయి. క్రీ.శ. 1288లో రాసిన ఖురాన్ వ్రాతప్రతులను ఇక్కడ జాగ్రత్త చేశారు. క్రీస్తు పూర్వం 1340లోని టుటెంకమెన్ నకలు ఉంది. జర్మనీలోని డ్రెస్‌డెన్, ఫ్రాన్స్‌లోని సెవర్స్, ఇటలీలోని కపోడిమాంటే, ఇంగ్లాండులోని వెడ్జ్‌వుడ్ నుండి సేకరించిన మృణ్మయ పాత్రలు ఎంతో అద్భుతంగా



సాలార్‌జంగ్‌లు

మూడవ సాలార్‌జంగ్ పూర్వీకులు పర్షియా నుండి వలసవచ్చారు. 'సాలార్‌జంగ్' అనేది నిజాం ప్రభువులు వీరికి ఇచ్చిన బిరుదు. సాలార్‌జంగ్‌లలో మొదటివారు మీర్ తురాబ్ అలీఖాన్, రెండో సాలార్‌జంగ్ మీర్ లాయత్ ఆలీఖాన్, మూడోవారు మీర్ యూసుఫ్ అలీఖాన్. వీరికి వస్తుసేకరణ హాబీగా ఉండేది. దీనిలో భాగంగానే దేశంలో అనేక కళాఖండాలను వీరు సేకరించారు. వీటిల్లో ఎక్కువ భాగం మూడో సాలార్‌జంగ్ సేకరించినవే కావడం గమనార్హం. మొదటి సాలార్‌జంగ్ మరణానంతరం రెండో సాలార్‌జంగ్ సేకరించాడు. అయితే అతను 27 సంవత్సరాలకే మృతిచెందడంతో మూడో సాలార్‌జంగ్ వీటిని సేకరించాడు. అందుకోసం పెళ్లికూడా చేసుకోలేదన్న ప్రచారం వుంది.


మెఫిస్ట్రోఫిస్-మార్గెటా

ఉంటాయి. నాలుగో శతాబ్దంనాటి విష్ణువిగ్రహాలు, ఎనిమిదో శతాబ్దం నాటి పార్శ్వనాథుని విగ్రహాలు, విజయనగర రాజులకాలం నాటి నటరాజ విగ్రహం, శిలలపైనే సింహాలు, ఎద్దులు, గుర్రాలను, మలిచిన తీరు అద్భుతం. అంతే కాకుండా దేశంలో సాంచి, బుద్ధగయ, అమరావతి, నాగార్జున కొండ, నేలకొండపల్లి నుండి సేకరించిన బుద్ధుని విగ్రహాలు ... ఎన్నో అపురూప కళాఖండాలు ఇందులో ఉన్నాయి.

ఆయుధాలు చూడతరమా...

ఔరంగజేబు, టిప్పుసుల్తాన్ వాడిన ఆయుధాలు, తుపాకులను ఇక్కడ ప్రదర్శనలో ఉంచారు. ఇవేకాక మచిలీపట్నం, పాలకొల్లు, బైగానపల్లి నుండి సేకరించిన కలంకారీ వస్తువులు మ్యూజియంలో ఏర్పాటు చేశారు. అలాగే అప్పటి యుద్ధవీరులు వాడిన కత్తులు, కటార్లు, గదలను కూడా ప్రదర్శనలో ఉంచారు.

వస్త్రాల అందాలు వర్ణించలేం

ఇక వస్త్రాలకు కొదవేలేదు. కాశ్మీరుకు చెందిన అందమైన తివాచీలను చూడాల్సిందే. అలాగే మస్లు, ముస్లిన్, సిల్క్, వెల్వెట్, ఉన్ని లాంటి రకరకాల దారాలతో అల్లిన తివాచీలు, చీరలు వస్త్రవిభాగంలో మరుపురాని అనుభూతిని మిగల్చడమే కాకుండా అప్పటి కళాకారుల అద్భుత పనితీరుకు నిదర్శనంగా ఉన్నాయి. 18, 19 శతాబ్దానికి చెందిన కాశ్మీరీ శాలువాలు, పంజాబ్ సంప్రదాయ పులోరీ ఎంబ్రాయిడరీ, లక్నో చికెన్ పనితనం దక్షిణాది రాష్ట్రాల పట్టుచీరలు ఇట్టే ఆకట్టుకుంటాయి. పర్షియా దారాలతో రూపొందించిన కార్పెట్లూ ఉన్నాయి.

ప్రతి వస్తువూ ప్రత్యేకమైనదే

జర్మన్ సర్కస్ ప్రతులు, తైలవర్ణచిత్రాలు... ఒకటేమిటి! మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రతి వస్తువూ ప్రత్యేకత సంతరించుకున్నదే. జైన, బౌద్ధ, పల్లవ, చోళ, కాకతీయ, విజయనగర రాజుల కాలంనాటి విగ్రహాలు, వస్తువులూ, దుస్తులనూ అప్పటి సాలార్‌జంగ్‌లు సేకరించారు. వాటిని ఇందులో ప్రదర్శనకు ఉంచారు.

తైలవర్ణచిత్రాలు చూస్తే చిత్తైపోవాల్సిందే!

పర్షియా సిరియా ప్రాంతాలకు చెందిన అందమైన కళాకృతులు, 18వ శతాబ్దంనాటి తైలవర్ణచిత్రాలు ఉన్నాయి. ఆధునిక చిత్రకళకు వచ్చేటప్పటికి రవివర్మ కుంచె నుండి జాలువారిన అందమైన కేరళ యువతి (ది కేరళ బ్యూటీ), స్టోలెన్ 'ఇంటర్వ్యూ' చిత్రాలున్నాయి. అబింద్రనాథ్‌బోస్, నందలాల్‌బోస్, బి.బి.ముఖర్జీ, జోగ్‌తాయ్, మనోజీ లాంటి చిత్రకారుల చిత్రాలు ఉన్నాయి.

రాతిని మలిచిన తీరు అద్భుతం

బర్మా, అమెరికా న్యూజిలాండ్, దేశాల్లో లభ్యమయ్యే జేడ్ రాతితో చేసిన పరికరాలు ఉన్నాయి. ఖురాన్‌ను చదివేందుకు జేడ్‌రాతితో ఏర్పాటు చేసిన స్టాండును మలిచిన తీరు అద్భుతం.

అభిరుచికి అద్దం

ఐరోపా ఖండానికి చెందిన క్లెబినేట్స్, కన్సొలెట్స్, కుర్చీలు, సోఫాలు, బల్లలు ఉన్నాయి. 18వ శతాబ్దానికి చెందిన ఆర్చి ఆకారపు గడియారం, స్విట్జర్లాండ్ నుండి సేకరించిన వివిధ రకాలు గడియారాలు, తాబేలు చర్మంతో చేసిన గడియారం, ఎనామిల్ అలంకరణలు నిజాం ప్రభువుల అభిరుచులకు అద్దం పడుతుంటాయి.

విషాన్ని గుర్తించే పాత్రలు

మ్యూజియంలో చెప్పుకోదగ్గవి విషాన్ని గుర్తించే 'సెలడాన్' పాత్రలు. అప్పటి ప్రభువులు ఆహార పదార్థాల్లో విషప్రయోగమేమన్నా జరిగిందా లేదా అనేది తెలుసుకునేందుకు ఈ పాత్రలు ఉపయోగించేవారు. వీటిల్లో ఆహారపదార్థాలను ఉంచితే విషం గనుక ఉంటే పచ్చరంగులోకి మారేవి, లేదా పగిలిపోయేవి. వీటినీ ఫ్రాన్స్ నుండి సేకరించారు.

చిన్నారుల విభాగం

చిన్నారుల కోసం ప్రత్యేక విభాగం ఉంది. అందులో విజ్ఞానాన్ని అందించే వస్తువులతోపాటు అబ్బురపరిచే వస్తువులూ ఉన్నాయి. అంతేకాకుండా పొట్టిగా ఉండే బుద్ధవిగ్రహాలు, ఒక పక్క నుండి చూస్తే మనిషి, మరోపక్క నుండి చూస్తే గాడిద కనపడే విధంగా రూపొందించిన చిత్రం అద్భుతంగా ఉంటుంది. చిన్నారులను అలరిస్తుంది.



అలాగే బెరియోన్ రూపొందించిన క్లియోపాత్రా, ఇటాలియన్ చిత్రకారుడు రూపొందించిన బెబె (చిన్నారుల కోసం) చిత్రాలు ఇక్కడ ఉన్నాయి.

ముసుగు సుందరి

మేలి ముసుగు రెబెకా విగ్రహాన్ని ఇటాలియన్ చిత్రకారుడు బెంజోనీ తయారు చేశారు. ముసుగులోంచి చూస్తున్న మహిళ పాలరాతి శిల్పం అద్భుతంగా వుంటుంది. ఈ కళాఖండాన్ని చూస్తే చాలు శిల్పి నైపుణ్యం అర్థమైపోతుంది. దీనిని మొదటిసాలార్‌జంగ్ మీర్ తురబ్ ఆలీఖాన్ సేకరించాడు.

మ్యూజికల్ గడియారం

దీనిని కూడా మొదటి సాలార్‌జంగ్ సేకరించాడు. దీనికోసం తయారు చేసిన వస్తువులను ఇంగ్లాండు నుండి తీసుకొచ్చి కలకత్తాలో బిగించారు. ఇందులో 'గ్యాంగ్‌మెన్'గా పేర్కొనే వ్యక్తి ప్రతిగంటకు గడియారం నుండి బయటకొచ్చి గంట కొట్టి వెళుతుంటాడు. ఇది నిజంగా అద్భుతం. మ్యూజియంలో దీనిని చూసేందుకు ప్రేక్షకుల కోసం కుర్చీలను ఏర్పాటు చేశారు. 12 గంటల సమయంలో దీనిని చూసేందుకు ఎక్కువ మంది ఇష్టపడుతుంటారు. ఎందుకంటే ఆసమయంలో ఎక్కువ సమయం ఉండి ఎక్కువ గంటలు కొడతాడు. అయితే ఇటువంటి గడియారాలు దేశంలో మరికొన్ని ఉన్నా ప్రస్తుతం పనిచేస్తున్నది మాత్రం ఇదొక్కటే కావడం గమనార్హం.

ఒకే విగ్రహంలో ఇద్దరు

ఫ్రాన్స్ చిత్రకారుడు రూపొందించిన మెఫిస్ట్రోఫిలస్-మార్గెట్టా విగ్రహాన్ని సాలార్‌జంగ్ ఫ్రాన్స్ నుండి సేకరించాడు. ఒకే విగ్రహానికి ఒకవైపున వీరుడు, మరోవైపున అందమైన యువతిని మలిచిన తీరును చూడాల్సిందే. దీనిని మొదటి సాలార్‌జంగే సేకరించాడు.

మ్యూజియమ్ -మరికొన్ని విశేషాలు

ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శనార్థం తెరచి వుంటుంది. జాతీయ పండుగల సందర్భాలలోనే కాక ప్రతి శుక్రవారం సెలవు. టికెట్ వెల పెద్దలకు 10 రూపాయలు, 12 సంవత్సరాలలోపు విద్యార్థులకు 5 రూపాయలు వుంటుంది. బాలల దినోత్సవం సందర్భంగా మాత్రం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచిత ప్రవేశం వుంటుంది. ఇది ప్రతి ఒక్కరూ చూడదగిన ప్రదేశం అనడంలో ఆశ్చర్యం లేదు. ❋

విజ్ఞాన వీచిక

కథా నిలయం
శ్రీకాకుళం

కాకర్లమూడి విజయ్

మొక్కల నుండి ఇంధనం



పచ్చని మొక్కలు, లేదా బ్యాక్టీరియా నుండి సంగ్రహించిన పదార్థాలను సూక్ష్మగ్రూపులుగా (నానో క్లస్టర్స్) చేసి, వాటిని ప్లాటినం పలకలపై ఉంచాలి. ఈ నానో క్లస్టర్లు కిరణజన్య సంయోగ క్రియ ద్వారా విడుదల చేసే హై - ఎనర్జీ ఎలక్ట్రాన్లను తీసుకొని విద్యుత్ శక్తి గానీ, ఉదజని అణువులను గాని ఉత్పత్తి చేసి వాహనాల నుండి గృహాల వరకు ఇంధనంగానూ వాడవచ్చు.

భవిష్యత్తులో రానున్న ఇంధన కొరతను అధిగమించడానికి చాలా మంది చాలా విధాలుగా సమాయత్తమౌతున్నారు. సాంప్రదాయేతర ఇంధన వనరులను మథించి అందులో నుండి ఎట్టి పరిస్థితులలోనైనా లాభదాయకమైన ఇంధన సరఫరాని రాబట్టాలని పట్టుదలతో ఉన్నారు.

అణు ఇంధనమా, స్వచ్ఛమైన బొగ్గా, బయోడీజిలా, సౌరశక్తా, వాయు ఇంధనమూ, జలశక్తా అన్న విభిన్న ప్రశ్నలకి ఇదిమిద్ధమైన సమాధానాలు ఇప్పటికిప్పుడు లేకపోయినా, ఇప్పుడో సాంప్రదాయేతర ఇంధనం మాత్రం వచ్చి తీరవలసిందే. లేకపోతే మన భవిష్యత్తు అంధకారమే!

ఏదో రకంగా కొత్త పద్ధతిలో ఇంధనాన్ని రాబట్టాలన్న ఆలోచనతో బారీ బ్రూస్ ఒక ప్రత్యేకమైన దారిని ఎంచుకున్నాడు. సౌరశక్తిని మరో విధంగా వాడుకోవాలనుకున్నాడు. ప్రకృతిలోనే సూర్యుడి నుండి అద్భుత శక్తి ఉత్పత్తి అయ్యే ప్రక్రియ ఒకటి ఉంది. అదే కిరణజన్య సంయోగ క్రియ. కొన్ని బిలియన్ల సంవత్సరాల నుండీ మొక్కలు ఈ చర్యపై ఆధారపడి తమకు కావలసిన శక్తిని తయారుచేసుకొని, మనుగడ సాగిస్తున్నాయి.

టెన్నీసి విశ్వ విద్యాలయంలో అసోసియేట్-ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బ్రూస్, అతడి బృందం ఇప్పటికే కిరణజన్య సంయోగ క్రియను ఆధారం చేసుకొని శక్తిని ఉత్పత్తి చేసే పని ప్రారంభించారు.

పచ్చని మొక్కలు, లేదా బ్యాక్టీరియా నుండి సంగ్రహించిన పదార్థాలను సూక్ష్మగ్రూపులుగా (నానో క్లస్టర్స్) చేసి, వాటిని ప్లాటినం పలకలపై ఉంచాలి. ఈ నానో క్లస్టర్లు కిరణజన్య సంయోగ క్రియ ద్వారా విడుదల చేసే హై - ఎనర్జీ ఎలక్ట్రాన్లను తీసుకొని విద్యుత్ శక్తిని గానీ, ఉదజని అణువులను గాని ఉత్పత్తి చేసి వాహనాల నుండి గృహాల వరకు ఇంధనంగానూ వాడవచ్చు.

ఈ ప్రక్రియ సౌరశక్తికి వాడే సోలార్ ప్యానెళ్ళ అంత సంక్లిష్టమైనది కాదు. పైగా వాటితో ముడిపడి ఉండే విష పదార్థాల సమస్యలూ వుండవు.

ఈ కొత్త రకం శక్తి ఉత్పాదక ప్రక్రియ విజయవంతమైతే అంటే లాభదాయకంగా విద్యుత్‌ని గానీ, ఉదజనిని గానీ ఉత్పత్తి చేయగలిగితే దీనిని ప్రపంచంలో ఎక్కడైనా చేయవచ్చు. మరి మొక్కలు ఎక్కడైనా పెరుగుతాయి కదా!

జంతు వ్యర్థాల నుంచి ఇంధనం

ఇంధనాన్ని ఇతర పదార్థాల నుండి తయారు చేసే ప్రయత్నాలు మరో చోట జరుగుతున్నాయి. జంతువుల వ్యర్థాల నుండి ఉపయోగకరమైన శక్తిని ఇంధన రూపంలో ఉత్పత్తి చేయడం గత కొంత కాలంగా జరుగుతున్నదే. బయో గ్యాస్ పేరుతో చాలాచోట్ల ఇటువంటి శక్తి వినియోగమూ జరుగుతోంది. అనుకున్నట్టుగా ఈ పథకం విజయవంతం అయ్యింది. కానీ, అనుకున్నట్టుగా ప్రజాదరణ మాత్రం పొందలేకపోయింది. ఎందుకో గానీ ముందునుండీ సాంప్రదాయేతర ఇంధనాలకు సామాన్య ప్రజల నుండి అవసరమైన స్పందన కరువయ్యింది. అయినా అటువంటి ప్రయత్నాలు మాత్రం మానలేదు. వాస్తవ పరిస్థితులను చూస్తే ఆ ప్రయత్నాలు ఇంకా ముమ్మరమై సాంప్రదాయేతర ఇంధనాలు అత్యంత త్వరగా అభివృద్ధి పరచబడి, అత్యంత వేగిరంగా వినియోగంలోకి రావలసిన అవసరం ఉంది.

ఈ క్రమంలో భాగంగా అమెరికాలో మానవ వ్యర్థంతో పని చేసే విద్యుత్ జనరేటర్‌ని రూపొందించారు. దీనిని మైక్రోబియల్ ఫ్యూయల్ సెల్ (ఎంఎఫ్‌సి) అంటారు.

మానవ వ్యర్థంతోనూ....

మానవ వ్యర్థంలో జీర్ణం కాని సేంద్రియ పదార్థాలైన కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, లిపిడ్లు ఉంటాయి. సాధారణంగా వాడుకలో ఉన్న మురుగు ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో బ్యాక్టీరియా ఈ సేంద్రీయ పదార్థాలను ఏంజైములు సాయంతో ఆక్సీకరణ చేస్తాయి. ఈ ప్రక్రియలో ఎలక్ట్రాన్లు విడుదలలైతాయి. ఈ ఎలక్ట్రాన్లే విద్యుత్‌ని మోసుకెళతాయి. సాధారణంగా ఈ ఎలక్ట్రాన్లు బ్యాక్టీరియా కణాలలోని శ్వాస ప్రక్రియకి తోడ్పడతాయి. ఆ తరువాత ఆక్సిజన్‌తో కలుస్తాయి. ఒకవేళ ఎంఎఫ్‌సిలో బ్యాక్టీరియాకి ఆక్సిజన్ అందకుండా చేస్తే, మరొక పక్క నుండి ఆ ఎలక్ట్రాన్లు విద్యుత్ ఉత్పాదనలో ఉపయోగపడతాయి.

ఎంఎఫ్‌సి 15 సెంటీమీటర్ల పొడవున్న ఫిల్మ్‌రోల్ డబ్బాలాగా ఉంటుంది. దాని మధ్యలో ఒక కాథోడ్ రాడ్ ఉంటుంది. ఆ కడ్డీ చుట్టూ ఒక ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ పొర (పిఇఎం) ఉంటుంది. కాథోడ్ కడ్డీని వలయంగా కప్పుతూ పొడవైన గ్రాఫైట్ కడ్డీలుంటాయి.

ఈ కడ్డీల చుట్టూ బ్యాక్టీరియా మూగుతాయి. ఈ ఎంఎఫ్‌సిలోకి పంప్ చేయబడ్డ వ్యర్థాలను బ్యాక్టీరియా ప్రభావితం చేస్తాయి. ఫలితంగా ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు విడుదలౌతాయి. ఎలక్ట్రాన్లను పీల్చుకునేందుకు ఆక్సిజన్ లేకపోవడంతో, బ్యాక్టీరియా వాటిని యానోడ్ల వైపు పంపిస్తాయి. ప్రోటాన్లు క్యాథోడ్ వైపు వెళ్తాయి. ప్రోటాన్లు పిఇఎం దగ్గరలోని ఆక్సిజన్‌తోనూ ఎలక్ట్రాన్లతోనూ మిళితమై నీరు ఏర్పడుతుంది. ఎలక్ట్రాన్లు క్యాథోడ్ నుండి ట్రాన్స్‌ఫర్ అయ్యేటప్పుడు విద్యుత్ జనిస్తుంది. దీనిని వాడవచ్చు.

ఔరా చూశారా... సైన్సు మహిమ!
వ్యర్థం నుండి విద్యుత్తా?!

సమ్‌థింగ్ స్పెషల్

ఎస్.కె. అయూబ్, మిర్యాలగూడ.

బుల్లి చొక్కా భలే ముద్దొస్తోంది



0.6 ఇంచుల చొక్కా

చొక్కాను తయారు చేస్తున్న సంగిశెట్టి కృష్ణ

సాధారణంగా పెద్దవాళ్లకు చొక్కా కుట్టాలంటే... ఎంత బట్ట కావాలి? కనీసం 2 మీటర్ల నుంచి ఆ పై క్లాత్ అవసరం. కానీ కేవలం మూడు సెంటీమీటర్ల క్లాత్‌తోనే 0.6 ఇంచుల బుల్లిచొక్కాను కుట్టి తన ప్రతిభను చాటుకున్నాడు ఓ టైలర్. ఇదెలా సాధ్యమని ఆశ్చర్యపోతున్నారా!

అవునండీ బాబూ... నల్గొండ జిల్లా, మిర్యాలగూడ మండలం, యాద్గార్‌పల్లి నివాసి సంగిశెట్టి కృష్ణ 0.6 ఇంచుల చొక్కాను కుట్టి చూపించాడు. ఈ చొక్కా తయారీకి కేవలం 3 సెంటీమీటర్ల క్లాత్‌నే ఉపయోగించాడు. చొక్కాకు 2 బటన్లు, కాలర్, ఒక ప్యాకెట్, హ్యాండ్‌కఫ్స్ ఉన్నాయి. స్వతహాగా టైలరైన కృష్ణ గతంలో (1995లో) బొంబాయికి వలస వెళ్లినప్పుడు ఒకటిన్నర ఇంచుల అరచేతుల చొక్కా కుట్టాడు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం ఈ ప్రయోగం చేశాడు. అయితే చొక్కా తయారీకి మూడున్నర గంటలు శ్రమించాడు లెండి. అవకాశం కల్పిస్తే చార్మినార్‌కు కూడా చొక్కా కుట్టి గిన్నిస్ బుక్‌లో ఎక్కాలని ఆశగా ఉందంటున్నాడు ఈ కృష్ణ.

కృష్ణ ఏమంటున్నాడంటే...

నేను 8వ తరగతి వరకే చదివాను. ఇద్దరు పిల్లలున్నారు. గతంలో బొంబాయిలో పనిచేసినప్పుడు ఒకటిన్నర ఇంచుల చొక్కాను తయారు చేశాను. దానికి మంచి ఆదరణ రావడంతో 0.6 ఇంచుల చొక్కా కుట్టాను. గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాలనుంది. ❄







వంకర రోడ్డు



ఒకడు: రోడ్డు... ఇంత వంకరటింకరగా వేశారేంటి?

ఇంకొకడు: రోడ్డు పక్కన మంత్రిగారి మరుదుల పొలాలున్నాయిలెండి!

సౌందర్య రహస్యం

విలేకరి: (సినీ తారతో) మీరు ఈ వయసులో కూడా ఇంత అందంగా వున్నారు! ఏ సబ్బు వాడతారేంటి?

సినీ తార: నేను ఏ సబ్బూ వాడకపోవడమే నా సౌందర్య రహస్యం.

ఎవరిది?

కొత్తగా కట్టిన బిల్డింగులు చూచి

ఒకడు: ఈ ఇల్లు ఎవరిది?

రెండవవాడు: మా ఎంఎల్ఏ గారిది

ఒకడు : ఈ ఇల్లు ఎవరిది?

రెండవవాడు: మా ఎం.పి గారిది

ఒకడు: ఆ పక్కనే వున్న గుడిసెలెవరివి?

రెండవవాడు: ఓట్లు వేసిన మా అందరివి!

బాంబు పేలితే

టీచర్: (విద్యార్థితో) న్యూట్రాన్ బాంబు పేలితే ఏమౌతుంది?

విద్యార్థి: చూడడానికి మనం ఎవరమూ వుండంగా సార్!

కంటి ఆపరేషన్

డాక్టర్: (ఒక పేషెంటుకు కంటి ఆపరేషన్ చేసి, కట్లు విప్పి) మెల్లగా కళ్లు తెరిచి చూడు... ఏం కనబడుతున్నాయి?

పేషెంట్: మీరంతా కనబడుతున్నారు సార్.

డాక్టర్: (బిల్లు చూపించి) ఈ కాగితం మీద అంకెలు కనబడుతున్నాయేమో చూడు

పేషెంట్: కనబడడం లేదు సార్!

ఏం ఉద్యోగం?

ఒకడు: మీరు ఏ ఉద్యోగం చేస్తున్నారు?

రెండోవాడు: నిరుద్యోగం



మూగనోము

సాగర్: ఏరా! పెళ్లి కాకముందు ఫుల్‌స్టాప్ కామాల్లేకుండా మాట్లాడేవాడివి. ఇప్పుడు నోరు విప్పడం కష్టంగా వుంది. ఏమైందిరా?

గోపాల్: ఇప్పుడు నా బదులు కూడా మా ఆవిడే మాట్లాడుతోందిలే.

బెంగ

రాజు: ఒరే రాజేష్! ఆపరేషన్ చేసిన దగ్గర నుంచి అలా చిక్కిపోతున్నావేంటి?

రాజేష్: ఆపరేషన్ సరిగా చేశారో లేదోనని బెంగగా వుందిరా

తినకూడదు

డాక్టర్: (పేషెంటుతో) మీరు కొన్నాళ్లపాటు ఈ పదార్థాలు తినడం మానెయ్యాలి.

పేషెంటు: (ఆశగా) తర్వాత అన్నీ తినొచ్చా డాక్టర్!

డాక్టర్: ఓ ... మీరు వుంటే.

గుండు

రాము: ఏరా గుండు చేయించుకున్నావ్!

జగన్: టీవీలో చూపించిన షాంపూలు వాడారా. ఆఖరికి ఇది మిగిలింది.

అరుణ్‌జీ, విశాఖ.







కథా నిలయం
శ్రీకాకుళం

డా॥ జె.పి. వైద్య

ఒకరు 'ఎవర్‌గ్రీన్ అందాల రాముడు'...'దేవదాసు'లా మనం తాగకున్నా కైపెక్కించిన అక్కినేని నాగేశ్వరరావు గారు.

మరో దేవుడు.... సినీ అభిమానుల్లో 'దేవుళ్ళు ఇలా ఉంటారు' అని చాటి చెప్పిన సినీ దునియా దైవ స్వరూపుడు 'నందమూరి తారక రామారావు'గారు. మనం ఈ పూట వెండితెర మీద దేవతా స్వరూపుడిగా అమరుడైన 'ఎంటిఆర్' గురించి ముచ్చటించుకుందాం.

అభిమానులు ఆయన్ను కేవలం ఒక అభిమాన నటుడిగానే గుర్తించి, ఆరాధించలేదు. తండ్రిగా, అన్నగా, గురువుగా, దైవంగా భావించారు. ఇంకా కొందరు మరో రకంగా కూడా ఆలోచించి పులకించి 'పరేశాన్' కూడా అయిపోయి ఉండొచ్చు. వారి సంగతి మనం ఊహించలేము. కాబట్టి, సగౌరవంగా 'మన దారికే వచ్చేద్దాం.



అన్నగారి నటన 'న భూతో న భవిష్యత్!'

కదిలే బొమ్మలు మనల్ని పరవశం చేసే ప్రక్రియ మన దేశంలో ప్రారంభమై వంద సంవత్సరాలు దాటాయి. రఘుపతి వెంకయ్య గారు తెలుగు గడ్డ మీద నాటక రంగానికి ఎనలేని పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టారు. మన నాటకాలు మెల్లగా రంగులూ, ఢంగులూ మార్చుకొని వెండి తెర మీద చిద్విలాసం చేశాయి. అప్పట్నుంచి మనం కూడా కళ్ళప్పగించి సినిమా తెరకు అంటుకొని పోయాం. వీరాభిమానులం అయిపోయాం. మనం, అంటే ప్రేక్షక మహాశయులం. వేపకాయంత వెర్రితనం, వేప చెట్టంత పిచ్చి కూడా ఉన్నవాళ్ళం.

మనకు ప్రేమ పుట్టుకొచ్చినా, కోపం లోపల్నించి తన్నుకొచ్చినా... ఉబ్బి తబ్బిబ్బు అయిపోతాం... లేదా పూనకం వచ్చినట్టు కదిలిపోతాం!

మనలో చొక్కా నలిగి పోకుండా 'మర్యాద రామన్న' లా బుద్ధిమంతుడిలాగా చిత్రాలు చూసి తరించి పోయే జాతి ఒకటుంది. మరో రకం జాతి కొంచెం పెంకె జాతి. అభిమానం కట్టలు తెంచుకొని పొంగి పొరలి పోయే జాతి అది.

మొదటి రోజు, మొదటి షో చూడకపోతే సర్వం కోల్పోయినట్టు ఫీలయిపోయి తిండి తిప్పలు మానుకునే జాతి అది. సినిమా రిలీజైన క్షణాల్లో పొంగి పొరలే జన సముద్రంలో, వీరావేశంతో దూసుకుపోయి చొక్కా చిరిగినా, చేయి విరిగినా, కాళ్ళు బెణికినా, ఉన్న కాసిని 'రూకలు' మట్టి కొట్టుకుపోయినా, లేచి, మట్టి దులుపుకొని, సదరు చిత్రం తాలూకు 'టిక్కెటు ముక్క'ను 'బంగారు పతకం'లా ఛాతీ మీద పెట్టుకొని గర్వంగా మందహాసాలు చేసే మహానుభావులం' మనం.

ఇదంతా ఒక వైపు సాగే దునియా!

మరో వైపు...

మనలను పిచ్చి వాళ్ళుగా మార్చేసిన వెండితెర కథానాయకులు!

నిజ జీవితంలో మనలాగే మామూలు మనుష్యులు అన్న మాట మనలో చాలా మంది ఒప్పుకోరు. మన దృష్టిలో వాళ్ళు 'దేవుళ్ళు'.... ఆ తరం వాళ్ళకు లభించిన అరుదైన దేవుళ్ళు...సినీ జీవితంతో పాటు ప్రజా జీవితంలోనూ ప్రత్యేకతను చాటుకున్న మెరుపుల, జిలుగు వెలుగులు రెండు కళ్ళు.



ఒకరు 'ఎవర్‌గ్రీన్ అందాల రాముడు'...'దేవదాసు'లా మనం తాగకున్నా కైపెక్కించిన అక్కినేని నాగేశ్వరరావు గారు.

మరో దేవుడు.... సినీ అభిమానుల్లో 'దేవుళ్ళు ఇలా ఉంటారు' అని చాటి చెప్పిన సినీ దునియా దైవ స్వరూపుడు 'నందమూరి తారక రామారావు'గారు. మనం ఈ పూట వెండితెర మీద దేవతా స్వరూపుడిగా అమరుడైన 'ఎంటిఆర్' గురించి ముచ్చటించుకుందాం.

అభిమానులు ఆయన్ను కేవలం ఒక అభిమాన నటుడిగానే గుర్తించి, ఆరాధించలేదు. తండ్రిగా, అన్నగా, గురువుగా, దైవంగా భావించారు. ఇంకా కొందరు మరో రకంగా కూడా ఆలోచించి పులకించి 'పరేశాన్' కూడా అయిపోయి ఉండొచ్చు. వారి సంగతి మనం ఊహించలేము. కాబట్టి, సగౌరవంగా 'మన దారికే వచ్చేద్దాం.

ఒక జమానాలో జానపదాల్లో 'న భూతో న భవిష్యత్' లా చెలరేగిపోయి నటించిన 'అక్కినేని' గారిని – సినీ రసికులు పరవశంతో పొంగిపోయి

–'అరే! గీయన అంటే రాజకుమారుడు భై! సాంఘీకాలకు ఏం పని కొస్తడూ?' అని నిక్కచ్చిగా తేల్చి చెప్పేసారు.

1949 ప్రాంతంలో 'బాలరాజు'గా... 'కీలుగుర్రం' మీద స్వారీ చేసిన నాగేశ్వర రావు అభిమానుల మనసులోని మాట అది.

కాస్తంత ఆలస్యంగా 'మన భూమి'లో ఇన్స్‌పెక్టర్ పాత్రలో వెలిగిపోయిన యువకుడిని చూసి మనం.. అంటే అలనాటి తరం ప్రేక్షకులు పూర్తిగా 'పాగల్' అయిపోయి....' అంరేcc గీయన్ను చూడున్రి.... కొత్త గొచ్చిండూ...' అని కుతూహలంగా చూశారు.

'మాయా బజార్'లో కృష్ణుడిగా వేయడం తెలుగు సినిమా దిశ, దశ తిప్పినట్టైంది. మన వాళ్ళు ఉలిక్కిపడి లేచి కూర్చున్నారు. అసలు కృష్ణుడిగా 'మాయాబజార్'లో నటించడానికి 'ఎన్టీఆర్' మానసికంగా సిద్ధంగా లేరు. కాని, నాగిరెడ్డి, చక్రపాణి, కె.వి.రెడ్డిల పట్టుదల, ఆత్మవిశ్వాసం మన తెలుగు సినీ ప్రేక్షకులకు 'శ్రీకృష్ణుడి'ని పరిచయం చేసి పెట్టింది.

12.04.1957 నాడు మాయాబజార్

తమిళ వర్షన్ రిలీజైంది. కాని, అంతకు ముందే 27.03.1957 నాడు రిలీజైన తెలుగు 'మాయాబజార్' నేటికీ తెలుగు సినీ చిత్ర జగత్తులోని ఒక అద్భుతమైన మణిపూస... అరుదైన రత్నం.... సొంపైన, ఇంపైన, హరివిల్లుల రంగులు చిమ్మిన వజ్రం!

తెలుగు చిత్ర సీమలో 'కృష్ణుడు' అవతరించాడు. నిలిచిపోయాడు. మనకు 'దేవుళ్ళు ఇలా ఉంటారు నాయనా! తెలిసిందా?' అని యావత్ ప్రపంచానికి చాటి చెప్పే సాధికారత వచ్చేసింది.

అందుకే 'నందమూరి తారక రామారావు' గారిని కారణ జన్ముడు' అని స్తుతిస్తే 'వాట్ ఈజ్ దిస్?' అని ఎవ్వరూ ప్రశ్నించలేకపోయారు.

నాడు! నేడు!! బహుశా ఎప్పటికీ కూడానూ!!! సాంఘిక, జానపద, పౌరాణిక, చారిత్రిక పాత్రల్లో- ఏ పాత్ర ధరించినా 'ఎన్టీఆర్' గారు సులువుగా ఆ పాత్రలో ఒదిగి పోయారు. ఇమిడిపోయారు. జీవించారు. జ్ఞాపకం ఉండి పోయారు.

ఒకవైపు గోపికా ప్రియుడు, జగన్నాటక సూత్రధారి 'శ్రీకృష్ణుడి' రూపంలో సుకుమారంగా, ధీరలలితుడిగా, కాస్తంత కొంటెతనం మేళవించిన లలిత రమ్య మనోహరుడిగా... మరోవైపు దుర్యోధన, రావణాసురుడి ధీరోదాత్త పాత్రల్లో, రవంత 'విలనీ' చూపులతో అంతే హృద్యంగా నటించి, జీవించడం ఆయనకే చేతనైంది.

చాంతాడంత పొడుగాటి, అతిక్లిష్టమైన 'నాన్‌స్టాప్ డైలాగ్'లను అవలీలగా కసకసా నమిలిపారేసి...'డైలాగించడం' ఆయన స్పెషాలిటీ! ఆ తర్వాత ఆయన్ను 'డైలాగ్ డెలివరీ' విషయంలో 'కాపీ' కొట్టే ప్రయత్నం ఎందరో చేసినా ఎవరూ మరో 'ఎన్టీఆర్' కాలేకపోయారు.

మూడున్నర దశాబ్దాల పాటు తెలుగు చిత్ర సీమను 'కృష్ణుడు' ఏకఛత్రాధిపత్యంగా పరిపాలించాడు. పుష్కర కాలం పాటు తెలుగు నాట రాజకీయ రంగాన్నీ శాసించాడాయన. ఆయన రాజకీయాభిప్రాయాలతో ఏ మాత్రం ఏకీభవించని వాళ్ళు కూడా, రాజకీయాల 'దునియా'లో ఆయన ప్రభావాన్ని కాదనలేదు.

విజయవాడ దగ్గర 'నిమ్మకూరు'కు ప్రపంచ పటంలో ఒక స్థానాన్ని గుర్తింపునూ తీసుకొస్తాడు మన బుడతడు 'తారక రాముడు' అని 23 మే 1923 నాడు జన్మ నిచ్చిన కన్న తల్లి వెంటకరావమ్మ, తండ్రి లక్ష్మయ్య చౌదరీ కలలోనూ ఊహించి ఉండక పోవచ్చు.

నిమ్మకూరులోనే ప్రాథమిక విద్యాభ్యాసం, బెజవాడ 'గాంధీ మునిసిపల్ హౌస్కూల్లో' స్కూలు ఫైనల్ చదువు సాగించాక, ఎస్.ఎస్.ఆర్ అండ్ సి.వి.ఆర్ కాలేజీలో 'ఇంటర్మీడియేట్' పూర్తి చేశారు.

'పెళ్ళి అయితే చదువు సాగదు నాయనా!' అని పెద్దోళ్ళూ, తల నెరిసిన వాళ్ళూ సలహాలు చెప్తూ వుంటారు. మనం 'ఆ! ఊ' అంటూ పెడ చెవిన పెట్టి, అంతే స్పీడ్‌గా జారేస్తూ ఉంటాం. ఎన్టీఆర్ గారు కూడా సరిగ్గా అలాగే 20వ ఏట 1942లో మే లో మేనమామ కూతురు 'బసవతారకం'ను పెళ్ళి చేసుకొని, హాయిగా రెండుసార్లు 'ఇంటర్' తప్పారు.

కానీ, జీవితంలో రాజీపడటం, మడమ తిప్పటం ఎరుగని 'ఎన్టీఆర్' పట్టుదల, కృషితో మళ్ళీ పరీక్షలు రాసి విజయం సాధించారు.

కాలేజీ జీవితంలో పట్టుకున్నది నాటకాల పిచ్చి. కాలేజీలో తెలుగు శాఖాధిపతి విశ్వనాథ సత్యనారాయణ గారు. ఆయన సంగతి తెలియని తెలుగు భాషాభిమాని తెలుగునాట ఉండడు. 'రాచమల్లుని దౌత్యం' నాటకరంగంలో 'నాగమ్మ' వేషం పౌరుషానికి గుర్తింపు మీసాలు. ఫలితంగా 'మీసాల నాగమ్మ' రంగస్థం మీద పాపులర్ అయింది. సినీ రంగంలో ఎంతో పేరు, ఘనత సాధించిన కొంగర జగ్గయ్య, ముక్కామల కృష్ణమూర్తి, శివరాం ఆయన సమకాలికులు. కాలేజీ మిత్రులు.

'నాయకురాలు' నాటకంలో నలగామ రాజు వేషం. శ్రీ రంజని గారి భర్త పి. పుల్లయ్య గారి చెవుల్లో ఊదారు. అలా 'వింధ్యారాణి'

చిత్రంలోని 'శివశ్రీ' పాత్ర నడుస్తూ వచ్చింది. డిగ్రీ ధ్యాస ఉన్న ఎన్టీఆర్ ఒప్పుకోలేదు. ఇది ఆరు దశకాల నాటి మాట. 1947లో ఎల్.వి. ప్రసాద్ గారి పరిచయం. ఎం.ఆర్.ఎ. సంస్థ వారి 'మన దేశం'లో ఇన్స్‌పెక్టర్ వేషం'తో ఆయన తిరుగులేని సినీ జీవితం ప్రారంభమైంది.

తెలుగు చలన చిత్ర రంగానికి రెండు మిల మిలా మెరిసే కళ్ళు.

సాంఘీకాల రవితేజస్సం 'అక్కినేని'... చారిత్రిక, పౌరాణికాల రణభేరి 'నందమూరి' వాళ్ళిద్దరూ కలిసి నటించాలి.... అది చూసి తరించాలి. అనే వింత కోరికలున్న ప్రేక్షో రత్నాలం మనం!

'సరే'- అన్నారు పెద్దోళ్ళు. తొలి చిత్రం 'పల్లెటూరి పిల్ల' - 'సత్యం-శివం' దాకా వాళ్ళు 16 చిత్రాల్లో కలిసి నటించారు. మనం 'గుండమ్మ కథ', -'మిస్సమ్మ' -'శ్రీకృష్ణార్జునయుద్ధం'- 'మాయా బజార్' లాంటివి జ్ఞాపకం ఉంచుకున్నా చాలు.

ఒక చేతి వేళ్ళన్ని సినిమాలు తప్ప 302 సినిమాల్లోనో 'ఎన్టీఆర్'ని హీరోయిజం వెలిగించిన పాత్రలే! ఎన్నని జ్ఞాపకం చేసుకుందాం! కొన్నింటినైనా తలచుకోక పోతే మనం పౌరుషం ఉన్న ప్రేక్షకులం కామని ఆయనకు కోపం రాదూ?

పాతాళ భైరవి (51), మల్లీశ్వరి(51), మిస్సమ్మ(55), మాయ బజార్ (57), అప్పుచేసి పప్పుకూడు (59) , శ్రీ వెంకటేశ్వర మహత్యం (60), రాముడు భీముడు (64), బొబ్బిలి యుద్ధం (64), పాండవ వనవాసం (65), దానవీర శూరకర్ణ- అడవి రాముడు (77), మేజర్ చంద్రకాంత్ (93) ... అన్నీ రాస్తే పేజీలు సరిపోవు లెండి!

తెలుగువారి ఆత్మగౌరవం నినాదంతో రాజకీయంగా సంచలనం సృష్టించిన ఎన్టీఆర్‌ది విలక్షణ వ్యక్తిమత్వం. క్రమశిక్షణకు ఆయన పెట్టింది పేరు.

సినిమాల్లో దేవుడిగా 'లక్ష్మి'తో 'పార్వతి'తో ఎన్ని వేషాలు వేసినా- నిజ జీవితంలో 'లక్ష్మీపార్వతి' గారి పాత్ర గురించి వాదోపవాదాలున్నాయి. సినిమాలో స్టెప్పుల గురించీ వాదాలున్నాయి. చంద్రుడిలోనూ మచ్చలున్నాయి. సూర్యుడిలోని 'స్పాట్స్' ఉన్నాయి. 'ప్రేక్షక మహారాజులమైన' మనకు స్పాట్స్ గురించి చీకూ-చింతలెందుకూ?

జనవరి18-1996లో మహానాయకుడు ఎన్టీఆర్ తిరిగిరాని తీరాలకెళ్ళిపోయాడు. మనం 'షాక్ తిన్నాం. కాని, మళ్ళీ లేచాం! సినిమా టిక్కెట్లూ, ఫస్ట్‌డేటూ, ఫస్ట్‌షోలూ లాంటి గురుతర బాధ్యతలు పని కట్టుకొని మరీ భుజాల మీద పెట్టుకొని తిరిగే మనకు అలసట అన్నదసలు ఉంటేగా? ఎన్టీఆర్ దేవుడి సిన్మా వచ్చిందంటే, పనులు పాతరలో పడేసి పరిగెత్తిపోమూ??

❋

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.

ఫోన్ : 08732223622

వీరి వీరి గుమ్మడి పండు

జవాబు



వీరి వీరి
గుమ్మడి
పండు
వీరి పేరు
సుస్మితాసేన్.

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031



వయసు పెరిగేకొద్దీ జ్ఞాపకశక్తి తగ్గుతుందా!

నా వయస్సు 50 సంవత్సరాలు. మేనేజర్‌గా జాబ్ చేస్తున్నాను. నాకు జ్ఞాపకశక్తి తగ్గుతోంది. వయసు పెరిగే కొద్దీ జ్ఞాపకశక్తి క్షీణిస్తుందని అంటారు. నిజమేనా! సలహా చెప్పగలరు?

రవీందర్, బాపట్ల.

చాలా మందిలో ఈ దురభిప్రాయం వుంది. మన మైండ్‌లో వున్న కణాలన్నీ పూర్తిగా నశించి పోవడానికి 2000 సంవత్సరాలు పడుతుంది. మన జీవితకాలం 60-70 సంవత్సరాలు మాత్రమే. కాబట్టి మన జీవిత కాలంలో యుక్తవయస్సు దాటిపోగానే మైండ్ పవర్ క్షీణించడం మొదలవుతుందని చింతించడం మూర్ఖత్వం. 70 ఏళ్ళు సమీపిస్తున్నా లతా మంగేష్కర్ శ్రావ్యంగా పాటలు పాడుతూనే ఉంది. అందుకే వయసుడిగి పోయిందనే ప్రసక్తి శరీరానికేమోగాని, మనసుకు మాత్రం లేదు. కంప్యూటర్ ఒక సెకనుకు 400 మిలియన్ల చొప్పున కాలిక్యులేషన్ చేస్తూ 100 సంవత్సరాల పాటు ఆగకుండా పని చేసినప్పటికి మైండ్ ఒక నిమిషంలో ఆ పని అంతటిని విజయవంతంగా పూర్తి చేయగలదు. కాబట్టి మన మైండ్ చాలా గొప్పది.

ఏదీ చెయ్యలేనంటారే!

నేను బి.ఎ. కంప్లీట్ చేశాను. ఇప్పటికి వన్ అండ్ ఆఫ్ ఇయర్ అయ్యింది. నాకు ఇంగ్లీష్ అంతగా రాదు. నాకు ఎప్పుడు కూడా గుడ్ పొజిషన్‌లో ఉండాలని నా కోరిక. నేను ఏది చేద్దామన్నా దాని మీద పూర్తి కాన్ఫిడెంట్‌గా ఉండలేకపోతున్నాను. దానికి కారణం ఫ్రెండ్స్ మరియు పేరెంట్స్. నీవు చేయలేవంటూ దానిపై డిస్కరేజ్ చేస్తున్నారు. మీరే నాకు గుడ్ గైడెన్స్ ఇవ్వగలరని మనవి చేసుకుంటున్నాను.

సురేందర్, వైజాగ్.

మన కళ్ళు ఈ ప్రపంచాన్ని నఖశిఖ పర్యంతం స్పష్టంగా చూస్తాయి. కాని మనల్ని మనం క్లియర్‌గా చూసుకోవడానికి ఉపయోగపడవు. అందుకే మనకు నిలువుటద్దం కావాలి. మీ ఆకారం పట్ల మీ చేష్టల పట్ల స్పష్టమైన అవగాహన లేందే మీకు ఒక నిర్దిష్టమైన సెల్ఫ్ ఇమేజి ఏర్పడదు. సెల్ఫ్ ఇమేజ్ ఏర్పడనిదే ఒక నిర్ణీత లక్ష్యం ఏర్పడదు. ఒక లక్ష్యం లేనిదే నేర్చుకోవడం కొనసాగదు. నీవు ఏమి చెయ్యాలో తెలుసుకో. నీ గురించి నీవు తెలుసుకో. నీ కోసం నీవు ఆలోచించు. మీ స్వయం సామర్థ్యాలను తెలుసుకోండి. నూతన విషయాలు



తెలుసుకోవడానికి ప్రయత్నం చేయండి. ఎవరూ ఎవరినీ డిస్కరేజ్ చెయ్యరు. నీవు నెగిటివ్‌గా ఆలోచిస్తూ సమయాన్ని వృథా చేస్తున్నావు. ఉన్న పరిమితమైన కాలంలోనే ఎక్కువ విషయాలను నేర్చుకునే నేర్పును సంతరించుకో. నీవు నేర్చుకున్న జ్ఞానమే రెండు, మూడు నెలలు ప్రాక్టీస్ చేయడం ద్వారా ఇంగ్లీషు బాగా వస్తుంది. కంప్యూటర్ నేర్చుకుంటూ పీజీ చెయ్యండి. మీ చదువు మీద ఏకాగ్రత ఉంటే నమ్మకం దానంతట అదే వస్తుంది. మీ ప్రయత్నమే మిమ్మల్ని ఉన్నతమైన వ్యక్తిగా నిలబెడుతుంది.

నత్తి వల్ల చదవలేకపోతున్నా..

నేను డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నాను. నాకు 20 సంవత్సరాలు. నేను ఒక మానసిక రోగిని. నేను చిన్నప్పటి నుండి నత్తితో బాధపడుతున్నాను. దీని వలన నా చదువు మీద శ్రద్ధ తగ్గిపోతోంది. దయచేసి నాకు తగిన పరిష్కారం చూపిస్తారని కోరుచున్నాను. నాకు చదువు మీద శ్రద్ధ పెరగడానికి తగిన సూచనలు ఇస్తూ నా సమస్యకు తగిన పరిష్కారం చూపగలరు?

మమత, విశాఖపట్నం

నత్తి అనేది మానసిక రోగం కాదు. నత్తి అనేది చిన్న తనంలో ఎదుటివారిని అనుసరించటం వల్ల ఎక్కిరించటం వల్ల, ఒక్కసారిగా భయపడడం వల్ల వచ్చే అవకాశం వుంది. మీరు మాట్లాడే విధానం ఒక వ్యాధి కాదని అలవాటుకు సంబంధించిన సమస్య అని గుర్తించడం ద్వారా నత్తి నుండి బయట పడే అవకాశం ఉంది. నత్తికి దోహదం చేసే ఆందోళన, భయాలను ముందుగా అధిగమించండి. ముందు మీ గురించి మీ మనస్సు గురించి అర్థం చేసుకోండి. చదువుపై దృష్టి పెట్టండి. నేర్చుకునే సామర్థ్యం పెంచు కోవడానికి ప్రయత్నించండి. అప్పడు మీరు బాగా చదువుకోగలుగుతారు.

❋

కాకరకాయ వేపుడు

కావలసిన పదార్థాలు

కాకరకాయలు- 1/4 కిలో, పల్లీలు- 150 గ్రాములు, నూనె- 100గ్రాములు, పెరుగు- 1 కప్పు, ఉప్పు, పసుపు, కారం- తగినంత, వెల్లుల్లి-15 రెబ్బలు- జీలకర్ర- 2 స్పూన్లు

తయారు చేసే విధారం

కాకరకాయలు శుభ్రంచేసి, ఉప్పు పెరుగు వేసి నీరు పోసి ఉడికించి వార్చి పక్కన పెట్టుకోవాలి. పల్లీలు, ఉప్పు, పసుపు, జీలకర్ర, వెల్లుల్లి, పొడి చేసుకొని అందులో కారం కలపాలి. ఈ మిశ్రమంలో నూనెవేసి కలుపుకొని కాకరకాయ పొట్ట చీల్చి, ఈ మిశ్రమం నింపాలి. కడాయిలో నూనె పోసి కాకర కాయలను సన్న సెగన వేయించాలి. ఈ కాకరకాయ వేపుడు 15 నుంచి 25 రోజులు నిల్వ ఉంటుంది. ప్రయాణాలప్పుడు తీసుకువెళ్ళటానికి బాగుంటుంది. పాడవకుండా ఉంటుంది. పల్లీల బదులు పుట్నాల పప్పు కూడా వాడవచ్చు.





క్యారెట్ లడ్డు

కావలసిన పదార్థాలు

క్యారెట్ తురుము - 4 కప్పులు, కొబ్బరి తురుము - 1 కప్పు, వేయించిన వేరుశనగ పలుకులు- 1/2 కప్పు, ఇలాచీలు- 10, పాలు- 1 కప్పు-, పంచదార-2 కప్పులు, నెయ్యి లేదా డాల్డా- 1/4 కప్పు.

తయారు చేసే విధానం

బాండీలో నెయ్యి వేడి చేసి క్యారెట్ తురుము వేసి కొద్దిగా వేయించి, పాలు పోసి ఉడికించాలి. రెండునిమిషాల తరువాత పంచదార పోసి కొబ్బరి తురుము కూడా వేసి ఉండ వచ్చేంత వరకు కలుపుతూ ఉడికించాలి. ఐదు నిమిషాల తరువాత ఉండ చేయటానికి తయారవుతున్నప్పుడు, వేరుశనగ పలుకులు, ఇలాచి పొడి వేసి బాగా కలిపి స్టౌ మీద నుంచి దించాలి. తర్వాత చిన్న లడ్డులుగా చుట్టుకోవాలి. ఇవి చాలా రోజులు నిలవ ఉంటాయి. బాగా చల్లారిన తరువాత బాక్సలలో లేదా బాటిల్స్‌లో పెట్టి నిల్వ చేసుకోవచ్చు. క్యారెట్ తినని పిల్లలకు ఇలా చేసి పెడితే తప్పకుండా తింటారు.

రుచి

బ్రెడ్ సమోసా

కావలసిన పదార్థాలు

ఉడికించిన ఆలు తురుము- 1 కప్పు, ఉల్లి తరుగు - 1 కప్పు, పచ్చిమిర్చి పేస్ట్-1 టీ స్పూన్లు, వెల్లుల్లి పేస్ట్- ఒక టీ స్పూన్, కొత్తిమీర తరుగు- 1/2 కప్పు, నూనె- తగినంత, ఆవాలు- 1/2 టీ స్పూన్, ధనియాల పొడి - 1/2 టీ స్పూన్, నిమ్మరసం- 1 టీ స్పూన్, సోంప్- 1/2 టీ స్పూన్, శనగపిండి-1 కప్పు, ఉప్పు - తగినంత, కొత్తిమీర- చట్నీ, గ్రీన్ చట్నీ- 1 కప్పు

తయారుచేసే విధానం

రెండు టీ స్పూన్లు నూనె వేడి చేసి ఉల్లి తరుగు, పచ్చిమిర్చి వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించి ధనియాల పొడి, ఉడికించిన ఆలు, ఉప్పు వేసి బాగా కలిపి ముద్దలా చేయాలి. ఇష్టపడేవారు కొంచెం సోంప్, కొత్తిమీర వేసి ఉంచాలి. శనగపిండి, ఉప్పు, పచ్చిమిర్చి పేస్ట్, కొత్తిమీర తరుగు, సోంప్ వేసి తగినన్ని నీళ్ళు పోసి బజ్జీల పిండి మాదిరిగా కలిపి బ్రెడ్ పీసులను క్రాస్‌గా కత్తిరించి రెడీగా పెట్టుకోవాలి. ఒక బ్రెడ్ పీస్‌మీద గ్రీన్‌చట్నీ రాసి దానిపై ఆలు కర్రీ పెట్టాలి. దానిపై వేరొక బ్రెడ్ పీస్ వుంచి దానికి గ్రీన్ చట్నీ రాయాలి. అదే మాదిరిగా అన్ని సాండ్‌విచ్‌లను శనగపిండిలో ముంచి తీసి నూనెలో వేసి రెండు వైపులా వేయించి తీయాలి. వీటిని ప్లేట్‌లో పెట్టి మధ్యకు కట్‌చేస్తే గ్రీన్ చట్నీ - ఆలుకర్రీ కనిపిస్తూ చాలా అందంగా ఉంటాయి. ఇష్టపడేవారికి టొమేటో కచప్ లేదా సాస్‌తో వేడిగా సర్వ్ చేయాలి.



కోడిగుడ్డు జున్ను

కావలసిన పదార్థాలు

పాలు- 1 లీటరు, గుడ్లు-7, మిరియాలు-30, ఏలకులు- 10, పంచదార-400 గ్రాములు

తయారుచేసే విధానం

కోడి గుడ్డు సొన తీసుకొని గిలక్కొట్టి పక్కన పెట్టాలి. మిరియాల పొడి, ఏలకుల పొడి తయారు చేసుకోవాలి. పాలల్లో పంచదార వేసి కరగనివ్వాలి. తీపి అంతగా అక్కర్లేదనుకుంటే కొంచెం పంచదార తగ్గించవచ్చు. పంచదార కరిగాక ఇవన్నీ బాగా కలిపి ఫిల్టర్ చేసి గిన్నెలో వేయాలి. స్టౌ మీద కుక్కరు లేదా వెడల్పు గిన్నె పెట్టుకొని దానిలో అంగుళం ఎత్తు నీళ్ళు పోయాలి. మనం పాలు పోసిన గిన్నెను కుక్కర్‌లో పెట్టి బాగా ఆవిరి వచ్చాక 10 నిమిషాలు సన్న సెగమీద ఉంచి ఆపు చేయాలి. ఈ ఐటమ్ చాలా సులువుగా తయారు చేసుకోవచ్చు. మనకు ఎప్పుడు కావాలంటే అపుడు జున్నుపాలు దొరకవు. కాబట్టి మన ఆత్మీయులు, దూర ప్రాంతాల వారు వచ్చినప్పుడు ఈ ఐటెం చేసి పెడితే చాలా సంతృప్తి చెందుతారు.

కథా నిలయం
శ్రీకాకుళం

మనసైన గీతాల భావ చిత్రణ!

మానవ జాతికి మాటలొచ్చిన తెల్లారే పాటలతో అవినాభావ సంబంధం ఏర్పడింది. మనస్సులోని ఉద్దేశం, భావాలు చెప్పడానికే పాటలు పుట్టాయి. మాటలూ, భాషా అభివృద్ధి చెందిన 'తొలి రోజుల్లో' సైతం కలిసి కట్టుగా కూతలేసినా, కుప్పి గంతులేసినా, చిందులు తొక్కినా- అలనాటి ఆదిమ కళలన్నీ వ్యాపార సాధనాలై పోయాయి.

పొలం పనులు, కులం పనులు చేసుకుంటూ కష్ట జీవులు పాడే పనిపాటలు తెలుగు గడ్డ మీద వ్యాపించి ఉన్నాయి.

ఏటి గడ్డ ఎర్రజొన్న
ఏడు మంచెలు కావాలోడా
ఎన్ను మీదారా గువ్వ వాలే
సిన్నా వాడా' లాంటి ర్యాల

పాటలున్నాయి. మన తెలుగు గడ్డమీద రాయలసీమ ఆ పాటలనే 'కపిల పాటలు' అంటారు. నాగేటి పాటలు, నాట్ల పాటలు, కలుపు పాటలు, మంచె పాటలు, కోత పాటలు, పోలి పాటలు, బండి పాటలు, దంపుడు పాటలు... ఇలా రక రకాల పాటలున్నాయి. తెలుగునాట!

'చింత కిందరో మోటారా
చిగురు మా మంచి ఎడ్ల జోడోయ్' అంటూ
'అరటి తోటలు అలుగులెల్లెనూ
మామిడి తోట మళ్ళి పారేనూ' అనే ప్రేయసీ ప్రియుల గీతాలున్నాయి.

అద్దాల రైక తొడిగి అద్దంలో అందాలు చూసుకునే ప్రియురాలి 'సోయగం' పాటలూ ఉన్నాయి. అందులో ప్రియురాలిని ప్రియుడి పోలికలు కూడా కవ్విస్తాయి మరి!

"గుబ్బంపు గుబ్బాల మీద
వద్దంపు 2 బిళ్ళాల రైక
వద్దామూల సూసుకుంటే - సంగాతి కాదా
ఇద్దారి పోలికలాయే 3"

ప్రకృతి నుంచి, అసమ వ్యవస్థ నుంచి వచ్చిన కష్టాలకు విశ్వాసంతో కూడిన గీతాలున్నాయి.

'భద్రాద్రి ఈశు నమ్మితే
అరుకై యారుపుట్ల జొన్న లెక్కువ'....

జానపద గీతికలు జాతికి జీవ నాళికల్లాంటివి. జానపద సాహిత్యం మీద పరిశోధనలు కూడా ఎంతో వేగంగా జరుగుతున్నాయి. సృజనాత్మకమైన జానపద గీతాల్లో శక్తి, ప్రేమ, సున్నితత్వంతో పాటు ఆత్మ విశ్వాసం కూడా ప్రస్ఫుటంగా దర్శన మిస్తుంటాయి.

ఏట్లె చాకలిది... ఎన్నియాలో
ఈల బెట్టుతుకంగా ఎన్నియాలో
ఈల విని ఆ రోజు ఎన్నియాలో
బంట్ల దోలిందు ఎన్నియాలో' లాంటి ఉత్సాహంతో బట్టలుతికే' చాకలి పడచు పాటలు' విన్పించే చోటే
'నూలు పున్నమినాడు... మూడిళ్ళ సాలీలు కూడిరయా' లాంటి సాలెవారి పాటలూ,
'అమ్మకల్లు అయ్యకల్లు
తిరుమలగిరి తీసికల్లు' లాంటి గౌండ్ల పాటలు....

'నా లగీసు మొగుడు బొగ్గుట్ట బోయి
కట్టెలు తెచ్చారే' లాంటి లంబాడీ వారి పాటలు
'జల జల రాలేటి
జాజి మల్లెలు' లాంటి బీడీ కార్మికురాళ్ళ గీతాలు మరెన్నో శృంగార గీతాలతో పాటు, ఆచార వ్యవహారాల తీరు తెన్నులు కళ్ళకు కట్టినట్టు తెలిపే గీతాలూ ఈ 'గీతాల పుస్తకంలో' ముస్తాబై ఉన్నాయి.

ఇది మనసున్న వారికి జానపద విజ్ఞాన గీత సేకరణ....

మనసైన గీతాల భావ చిత్రణ!
చదివించేలా చేస్తాయి...!

తెలంగాణా శ్రామిక గేయాలు
డా॥ గోపు లింగారెడ్డి
పేజీలు: 304/-, వెల- 150/-
ప్రతులకు: శ్రీమతి అరుణ, 7-1-249, మంగమ్మ తోట, కరీంనగర్ 505 001 మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

డా॥ జె.పి. వైద్య

నవ్య పథం

కోకా విమల కుమారి
వెల:40-,
పేజీలు:79
ప్రతులకు:
కోకా విమలకుమారి
ఇ.నెం. 59ఎ-16
1/2 సి టీచర్సు
కాలనీ,
విజయవాడ, విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు

గడ్డి దూడ

హైకు
జి. రాజశేఖర్

వెల:30/-,
పేజీలు: 108
ప్రతులకు:
జి. రాజశేఖర్,
డోర్. నెం.7-5-94,
జక్కావారివీధి, పేరాల,
చీరాల, ప్రకాశం.

SECULARISM VERSUS COMMUNALISM



Rate:150/-
Pages:164
Copies
Prajasakti
Book House
H.No. 1-1-187/1/2,
Viveknagar,
Chikkadpally,
Hyderabad.

SITARAM YECHURY
SOCIALISM IN A CHANGING WORLD



Rate:150/-
Pages:183
Copies
Prajasakti
Book House
H.No. 1-1-187/1/2,
Viveknagar,
Chikkadpally,
Hyderabad.
All Branches

ప్రకృతి అద్దిన రంగులు

ప్రకృతి అంటేనే సృజన. దాన్ని చూసి ఆనందించగలం. ఆస్వాదిం చగలం. కానీ దాన్ని మించి చేయాలంటే మానవమాత్రులకు కష్టమే. అందుకు నిదర్శనమే ఈ రంగురంగుల నాగులు. వాటిమీదున్న డిజైన్లు. చూడ్డానికి కాస్త భీతిగొల్పే విధంగా వున్నా... నాగుల మీద ప్రకృతి అద్దిన రంగు లను, డిజైన్లను చూచి అచ్చెరువొందాల్సిందే.



దెబ్బకు దెబ్బ
జరిగినకథ
నాంచారయ్య వ్యాపారం దెబ్బతినడంతో పొరుగూరు వెళతాడు. వెళ్లేటప్పుడు తన దగ్గర వున్న ఇనుపకమ్మీని భద్రపరచమని స్నేహితుడు వెంకయ్యకు ఇస్తాడు అయితే అతనూ అప్పులపాలై నాంచారయ్య ఇనుపకమ్మీని అమ్మేస్తాడు. అయితే ఓరోజు హఠాత్తుగా నాంచారయ్య వచ్చి తన కమ్మీ గురించి అడుగుతాడు. తర్వాత....
1
"ఓ...అదా! మర్చేపోయాను. నీకు తెల్సుగా. స్టోర్ రూమ్‌లో ఎలుకలు విపరీతంగా వున్నాయని. అవి కమ్మీని తినేశాయి. నాకు ఈ విషయం చెప్పాలంటేనే సిగ్గుగా వుంది" అన్నాడు వెంకయ్య నీరసంగా.
2
"ఫర్వాలేదు వెంకయ్యా! ఎలుకల సంగతి చెప్పేదేముంది! సరేగాని నీ కోసం ఓ బహుమతి తీసుకొచ్చాను. కాకపోతే ఇక్కడకు తీసుకురావడం మర్చిపోయాను. మీ అబ్బాయి రాముని పంపించు. ఇస్తాను" అన్నాడు ఎంతో అభిమానంగా. సంతోషంగా కుమారుణ్ణి నాంచారయ్యతో పంపించాడు వెంకయ్య.
3
ఇంటికెళ్లగానే రాముని స్టోర్‌రూమ్‌లో పెట్టి తాళం వేశాడు నాంచారయ్య. బహుమతి తీసుకు రావడం కోసం వెళ్లిన కొడుకు ఎంతకీ రాకపోయేసరికి వెంకయ్య కంగారుపడిపోయాడు. నాంచా రయ్య ఇంటికి వెళ్లి కొడుకు గురించి అడిగాడు. దానికి నాంచారయ్య విచారంగా మొహం పెట్టి వాడిని గద్దలు తీసుకెళ్లాయని చెప్పాడు.
4
దాంతో ఇద్దరి మధ్యా మాటా మాటా పెరిగింది. నువ్వెంత అంటే నువ్వెంత అనుకునేవరకు వెళ్లింది. ఇద్దరూ కలిసి న్యాయాధికారి దగ్గరకు వెళ్లారు. ఆయన ఇద్దరు చెప్పిందీ విన్నాడు.
5
ఇద్దరు చెప్పిన మాటల్లోనూ మోసం వున్నట్టు తెలుస్తూనే వుంది. కానీ దాన్ని ఎలా బయటపెట్టాలా అని ఆలోచించసాగాడు న్యాయాధికారి.
6
అందుకే నాంచారయ్య వైపు చూసి "ఏమయ్యా పెద్దమనిషీ! గద్దలు ఎక్కడైనా పిల్లవాణ్ణి ఎత్తుకెళతాయా?! నీ మాటలు విచిత్రంగా వున్నాయే" అన్నాడు.
7
"ఎందుకు కుదరదండీ! నా ఇనుప కమ్మీని ఎలుకలు తినగా లేంది! గద్దలు పిల్లవాణ్ణి ఎత్తుకెళ్లడంలో అసత్యమేముంది?!' అన్నాడు నాంచారయ్య.
8
దాంతో న్యాయాధికారికి ఒక విషయం బోధపడింది. వెంటనే "ఇదుగో! నాంచారయ్యా, వెంకయ్యా... మీ ఇద్దరికీ న్యాయం జరగాలంటే నిజం ఒప్పుకోవాలి" అన్నాడు. దాంతో వెంకయ్య తేరుకొని ఇనుపకమ్మీని ఎలుకలు తినలేదని అప్పు తీర్చడం కోసం అమ్మాననీ చెప్పాడు. వెంకయ్య నోటి వెంట ఆ మాట చెప్పించడం కోసమే పిల్లవాణ్ణి దాచిపెట్టి గద్దలు ఎత్తుకెళ్లాయన్నాడు నాంచారయ్య.
9
దాంతో న్యాయాధికారి సంతోషించి ... "వెంకయ్యా! నీకొడుకు కావాలంటే... ఆ కమ్మీని తిరిగి కొని నాంచారయ్యకు ఇవ్వు. అప్పుడు అతను నీ కొడుకును అప్పగిస్తాడు' అన్నాడు. న్యాయాధికారి చెప్పినట్టు చేసి తన కొడుకును తీసుకుని వెళ్లిపోయాడు వెంకయ్య.
(అయిపోయింది)
10